
ఏఎంసీ సెంటినరీ భవనం



ఎయిమ్స్ తరహాలో కేజీహెచ్

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తాం

- పెద్దాస్పత్రిలో లెవెల్-2 క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు రూ.60 కోట్లు
- అనకాపల్లిలో 'నైపర్' సెంటర్... 50 ఎకరాలు కేటాయింపు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేజీహెచ్‌ను ఎయిమ్స్ తరహాలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు విరాళాలతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి ప్రారంభించారు.



అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా గుర్తింపు పొందే సంస్థ ఉన్నత ప్రమాణాలు కలిగి ఉంటుంది. సదరు సంస్థకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ పెరుగుతుంది) ఏర్పాటుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీచేశామని, ఇరువురూ ఆ పనిలో ఉంటారన్నారు. అదేవిధంగా కేజీహెచ్‌లో లెవెల్-2 క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు రూ.60 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇక్కడే సెంటర్ ఫర్ కాంపిటెన్స్ ఇన్ సికిల్ సెల్ డిసీజస్ ఏర్పాటవుతుందన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజు. చిత్రంలో మంత్రి సత్యకుమార్, ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు ఉన్నారు. - మరిన్ని ఫొటోలు 8లో

అనకాపల్లిలో కేంద్ర ప్రభుత్వం సాయంతో నైపర్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) సెంటర్ ఏర్పాటుచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అందుకు 50 ఎకరాలు కేటాయించామన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 1923లో ఏర్పడిన ఆంధ్ర వైద్య కళాశాలలో ఎందరో మహామహులు చదువుకున్నారని, వారిలో కొందరి ఆలోచనలతో సెంటినరీ భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరి అలవాట్లు మారి ఆరోగ్యం కాపాడుకునే ... మిగతా 6వ పేజీలో

ఆర్థిక రాజధానిగా విశాఖ

- గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు వస్తున్నాయి

రాష్ట్రంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న, అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతం విశాఖ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. దేశంలో ఎక్కడ పదవీ విరమణ చేసినా నగరంలో స్థిరపడేందుకు ఇష్టపడుతుంటారన్నారు. అందుకే విశాఖను ఆర్థిక రాజధానిగా తయారుచేయాలని సంకల్పించామన్నారు. వచ్చే ఐదేళ్లలో విశాఖ ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు వస్తున్నాయన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటవుతుందని, ప్రపంచంలో డేటా మొత్తం ఇక్కడే స్టోర్ చేస్తారని, దీంతో ఈ ప్రాంతం అనేక విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.

వందేళ్ల వేడుక


ఏయూ శతాబ్ది వేడుకల ప్రారంభం సందర్భంగా బీచ్‌రోడ్డులో వాక్‌థాన్‌లో పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్, పలువురు ఆచార్యులు, ఉద్యోగులు

ఏయూ శత వసంతాల వేడుకలు ఘనంగా ప్రారంభం

- ఉదయం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్
- సాయంత్రం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన కార్యక్రమం
- శతాబ్దకాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అనేక మంది జీవితాలను స్పృశించిందన్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి
- ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామన్న వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

ఉత్సవాలను పురస్కరించుకుని ప్రారంభోత్సవ కార్యక్రమంగా బీచ్ రోడ్డులో ఉదయం కాళీమాత ఆలయం నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకూ వాక్‌థాన్‌ను నిర్వహించారు. వీసీ జీపీ రాజశేఖర్, ఏయూ అధికారులు, పూర్వ ఉపకులపతులతో కలిసి ఈ వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జయహో ఏయూ నినాదాలతో హోరెత్తించారు. ఏయూ ఖ్యాతిని తెలియజేసేలా ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపకులపతులు ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్, జీఎస్ఎన్ రాజు, బీల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఇక సాయంత్రం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రధాన కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఘనమైన వారసత్వం కలిగిన ఏయూ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషిచేయాలన్నారు. శతాబ్దకాలంగా ఆంధ్ర యూనివర్సిటీ అనేక మంది జీవితాలను స్పృశించిందన్నారు. విశిష్ట అతిథిగా అతిథిగా హాజరైన ఐఐటీ పాలక్కాడ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జాతీయ విద్యా విధానం డాక్యుమెంట్‌ను చదవాలన్నారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ దార్శనికుల వారసత్వం, నాయకత్వం ఏయూను నడిపిస్తున్నాయన్నారు. ట్రైనింగ్, ... మిగతా 6వ పేజీలో



ఏయూ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి. చిత్రంలో గౌరవ అతిథిగా హాజరైన పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శేషాద్రి శేఖర్, ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబు. - మరిన్ని ఫొటోలు 8లో


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి బ్యాగు తనిఖీ చేస్తున్న పోలీసులు

హై అలర్ట్

పహల్గాం ఘటన నేపథ్యంలో నగరంలో ఎక్కడికక్కడ తనిఖీలు

- కీలక ప్రాంతాల్లో పోలీస్ నిఘా
- రైల్వేస్టేషన్‌ను జల్లెడపట్టిన జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ బృందాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్ర దాడి నేపథ్యంలో నగరంలో హైఅలర్ట్ ప్రకటించినట్టు తెలిసింది. తూర్పుతీరంలో కీలక నగరం కావడంతో ఉగ్రవాదులు, సంఘ విద్రోహులు నగరాన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశం లేకపోలేదని కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించినట్టు ప్రచారం జరుగుతోంది. అందులో వాస్తవం ఉందో, లేదో తెలియదుగానీ నగర పోలీసులతోపాటు రైల్వే రక్షక దళం, కోస్టుగార్డు విభాగాలు అప్రమత్తమయ్యాయి. కీలక ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టారు. రైల్వేస్టేషన్‌లో ప్రభుత్వ ... మిగతా 6వ పేజీలో

ఫిల్మ్ క్లబ్బు... రాజకీయ గబ్బు

తారస్థాయికి రాజకీయాలు

భూ కేటాయింపు కోరుతూ ఇన్‌చార్జి మంత్రికి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు లేఖ

- దానిని క్లబ్ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసిన ప్రస్తుత అధ్యక్షుడు
- తనకు కనీస సమాచారం లేకుండా లేఖ ఇవ్వడంపై గంటా ఆగ్రహం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఫిల్మ్ క్లబ్)లో రాజకీయాలు తారస్థాయికి చేరుకున్నాయి. భీమిలి నియోజకవర్గంలో ఉన్న ఆ క్లబ్ వ్యవహారాలపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కంటే విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఎక్కువ ఆసక్తి చూపడం కొత్త వివాదానికి తెర తీసింది.

ఈ క్లబ్‌లో వర్గాలు ఉన్నాయి. మొన్నటి వరకూ క్లబ్‌ను నడిపించిన వైసీపీ నాయకులే విష్ణుకుమార్‌రాజును పోటీకి దించేందుకు తెర వెనుక మంత్రాంగం నడుపుతున్నారు. ఇందులో పాత చైర్మన్ కాయల వెంకటరెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, మరికొందరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. క్లబ్ ఎన్నికల్లో చైర్మన్‌గా విష్ణుకుమార్‌రాజును బరిలో దించారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎటువంటి అభ్యంతరం వ్యక్తంచేయలేదు. ఎవరి ఆసక్తి వారిదని సరిపెట్టుకున్నారు.

లేఖతో కట్టలు తెంచుకున్న ఆగ్రహం

క్లబ్‌కు ప్రభుత్వం నుంచి భూమి ఇప్పించడంలో గతంలో గంటా శ్రీనివాసరావు కీలకంగా వ్యవహరించారు. అప్పుడు క్లబ్‌కు అధ్యక్షులుగా సినీ నిర్మాత కేఎస్ రామారావు ఉండేవారు. మధురవాడ సర్వే నంబరు 426/3లో ... మిగతా 6వ పేజీలో


ఫిల్మ్ క్లబ్

నిబంధనలన్నీ గాలికి...

- క్లబ్ ఎన్నికల్లో పోటీ చేయాలంటే కనీసం ఐదేళ్ల సభ్యులుగా ఉండాలి. అయితే కొందరు కీలకమైన వ్యక్తులు పోటీ చేస్తున్నందున జనరల్ బాడీలో చర్చించకుండా ఆ గడువు మూడేళ్లకు తగ్గిస్తూ బైలాకు సవరణ చేసి, దానిని జిల్లా రిజిస్ట్రార్ వద్ద నమోదుచేశారు. ఎవరి కోసం ఈ పనిచేశారో చెప్పాలని సభ్యులు నిలదీస్తున్నారు.
- క్లబ్‌ను చిత్ర పరిశ్రమలో పనిచేసే వారి కోసం ఏర్పాటు చేశారు. గతంలో వారి సారథ్యంలోనే నడిచింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిశ్రమకు చెందిన వారిని పక్కకునెట్టి కాయల వెంకటరెడ్డి, ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి, ఎస్ఆర్ షాపింగ్ మాల్ గోపీనాథ్‌రెడ్డి, విజయసాయిరెడ్డి అల్లుడు శరత్ చంద్రారెడ్డిలను పెట్టి నడిపించారు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తరువాత కూడా సినీ పరిశ్రమకు చెందిన వారికి అవకాశం ఇవ్వకుండా వైసీపీ నాయకులు తెర వెనుక ఉంటూ రాజకీయ ప్రముఖులను పోటీకి దింపుతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడ ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.


మత్స్యకార సంఘాల ప్రతినిధులకు మత్స్యకార భృతి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మత్స్యకారులకు రూ.24.27 కోట్ల భృతి

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

సముద్రంలో చేపల వేట సాగించే వారికి మత్స్యకార భృతి కింద రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.24,27,60,000 మంజూరుచేసింది. ఈ మొత్తాన్ని జిల్లాలో 12,138 మంది కుటుంబాలకు శనివారం పంపిణీ చేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.20 వేల చొప్పున అందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో మత్స్యకారులకు ఈ భృతిని పంపిణీ చేశారు. వీడియో సమావేశం ద్వారా ఇందులో పాల్గొన్న విశాఖ జిల్లా అధికారులు అక్కడ సీఎం చంద్రబాబు ప్రసంగం ముగిసి, నిధులు విడుదల చేసిన అనంతరం మెగా చెక్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా మత్స్యకార సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.70 కోట్లకు 'స్నేహ మాక్స్' టోపీ

- సంస్థ కార్యాలయం ఎదుట డిపాజిట్‌దారుల ఆందోళన

సీతంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

అధిక వడ్డీ ఆశ చూపి విశ్రాంత ఉద్యోగుల వద్ద నుంచి రూ.లక్షల్లో డిపాజిట్లు సేకరించిన 'స్నేహ మాక్స్' సంస్థ రూ.70 కోట్లకు టోపీ పెట్టింది. ఆ సంస్థ యజమాని కటికల శివ భాగ్యారావు హైదరాబాద్‌కు మకాం మార్చేయడంతో బాధితులు లబోదిబోమంటూ రోడ్డెక్కారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం సీతంపేట రాజేంద్ర నగర్‌లోని స్నేహ మాక్స్ కార్యాలయం ... మిగతా 6వ పేజీలో




డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తిన ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, కొణతాల, పల్లా, విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్లు (ఇన్‌సెట్‌లో) ఓటింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

- తీర్మానానికి 74 మంది సభ్యుల మద్దతు
- పదవి కోల్పోయిన జియ్యాని శ్రీధర్

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీసు ఆధారంగా శనివారం జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఎన్నికల అధికారి హోదాలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు మొత్తం 111 మందికిగాను 74 మంది (2/3 వంతు...కోరం) ... మిగతా 6వ పేజీలో

గోసంతతి సంరక్షణలో నిర్లక్ష్యం

- గంధం అమావాస్య పురస్కరించుకుని 150 దూడలను మొక్కుబడిగా అందించిన భక్తులు
- కనీస శ్రద్ధ చూపని అధికారులు



చాలీచాలని పశువుల పాకలో లేగదూడలు

సింహాచలం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు మొక్కుబడిగా సమర్పిస్తున్న గోసంతతి సంరక్షణ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం గంధం అమావాస పురస్కరించుకుని సుమారు 150కు పైగా దూడలను భక్తులు తొలిపా వంచా వద్ద పూజలు చేసి, వదిలివెళ్లారు. భక్తులు వదిలిన గోసంతతిని దేవస్థానం సిబ్బంది ప్రత్యేక పాకలో ఉంచి పశు సంవర్ధకశాఖ, రెవెన్యూ, దేవదాయ శాఖాధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ సూచనల మేరకు పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డును చూసి వాటిని నమోదు చేసుకుని గోసంతతిని దత్తతగా అందజేస్తారు. ఈ విధానం ఎప్పటి నుంచో అమల్లో ఉంది. 2013లో వేలాదిగా భక్తులిచ్చిన గోసంతతిని సంరక్షించడంలో అప్పటి అధికారులు విఫలం కావడంతో వందలాదిగా లేగదూడలు వారం రోజుల పాటు మృత్యువాత పడ్డాయి. తాజాగా అప్పన్నకు వస్తున్న లేగదూడల సంరక్షణలో కూడా అధికారులు అదే వైఖరి కనబరుస్తున్నారు. తొలిపావంచా వద్ద ఉంచిన పాక చాలకపోవడంతో లేగదూడలు అనేకం ఎండలో ఉన్నాయి. తొట్టెల్లో నీరు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఆ నీటిలో తవుడు, చిట్టు, పొట్టు వంటి దాణా ఏమీ లేకపోవడం గమనార్హం. అధికారుల తీరుపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



తొట్టెలో తక్కువగా ఉన్న నీరు



గరుడ వాహనంపై స్వామివారు

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో పలు స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. తొలుత భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారికి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తం

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె. స్వప్న సూచించారు. శనివారం ఆమె రౌతులపాలెం, అన్నంపేట గ్రామాల్లో పర్యటించి, జ్వరపీడితులను పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 11 గంటల తరువాత అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని చెప్పారు. తాగునీరు, మజ్జిగ, నిమ్మ రసం అధికంగా తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జింక మృత్యువాత



విశాలాక్షినగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరి ఏరినా పార్కు సమీపంలో శనివారం ఓ జింక మృతి చెంది ఉంది. మృతికి గల కారణం తెలియరాలేదు. ఎండల తీవ్రత పెరగడంతో నీటి కోసం వచ్చి మృతి చెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

ఆనందపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను నాగాలాండ్ బృందం శనివారం పరిశీలించింది. ఆనందపురం సుపోషిత్ గ్రామ పంచాయత్‌గా ఎంపికైంది. ఈమేరకు బృంద సభ్యులు కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలు గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ చిన్నయిదేవి, సీడీపీఓ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ శ్రీకళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నం, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి పాల్గొన్నారు.



సీతంపేటలో స్నేహ మాక్స్ భవనం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

రూ.70 కోట్లకు 'స్నేహ మాక్స్' టోపీ

... 5వ పేజీ తరువాయి

వద్ద ఆందోళనకు దిగారు. డిపాజిట్‌దారుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు పిరుబండి ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి బోని అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2008లో కటికల శివ భాగ్యారావు స్నేహ మాక్స్ సంస్థను ఏర్పాటుచేశాడు. ఎస్సీ, ఎస్టీలకు ఆ సంస్థలో ఉద్యోగాలిచ్చాడు. స్నేహ మాక్స్ కో-ఆపరేటివ్ సంస్థలో విశ్రాంత ఉద్యోగులతో డిపాజిట్లు కట్టించారు. బ్యాంకుల్లో కేవలం 7 శాతం వడ్డీ ఇస్తారని, అదే స్నేహ మాక్స్ సంస్థలో డిపాజిట్ చేస్తే 12 శాతం వడ్డీ వస్తుందని నమ్మించాడు. ఇలా పలు సంస్థల విశ్రాంత ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ డిపాజిట్లు కట్టించాడు. కొద్ది నెలలు వడ్డీని సక్రమంగానే ఇచ్చాడు. వడ్డీ కూడా తమ సంస్థలోనే డిపాజిట్ చేసే మరింత అధికంగా డబ్బులు వస్తాయని నమ్మించాడు. ఇలా సుమారు 300 మంది వద్ద నుంచి రూ.70 కోట్లు సేకరించాడు. ఎనిమిది నెలల నుంచి సీతంపేట సంస్థలో కనిపించకుండా హైదరాబాద్‌కు మకాం మార్చేశాడు. వడ్డీ, కట్టిన డిపాజిట్లు అడిగితే అదిగో, ఇదిగో...అంటూ తప్పించుకున్నాడు. దీంతో 160 మంది బాధిత డిపాజిట్‌దారులు సంఘంగా ఏర్పడ్డారు. తమకు న్యాయం చేయాలని నగర పోలీసు కమిషనర్‌ను అభ్యర్థించగా దువ్వాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని(బాధితులంతా ఆ స్టేషన్ పరిధిలో ఉన్నారు) సూచించడంతో స్నేహ మాక్స్ సంస్థపైన, యజమాని భాగ్యారావు, కొందరు డైరెక్టర్లపై ఫిర్యాదు చేసినట్టు వివరించారు. ఆందోళన కార్యక్రమంలో బాధిత డిపాజిట్ పరిరక్షణదారుల సంఘం ప్రతినిధులు జె.వి. ప్రభాకర్, నక్కా రత్నరాజు, బాల భాస్కర్‌రావు, బాలయోగి పాల్గొన్నారు.

ఇనాం భూములకు పట్టాలివ్వాలని వినతి

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణరాజుపేట గ్రామంలో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు పట్టాలు అందించాలని రైతులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. శనివారం వారు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసీల్దార్‌కు ఇచ్చిన వినతి మేరకు సాగు రైతులకు హక్కు ఉందని నోటీసులు జారీ చేశారని, వాటి ఆధారంగా తమకు పాసు పుస్తకాలు జారీ చేయలేమని అంటున్నారని చెప్పారు. చాలామంది రైతుల వద్ద ఈ భూములకు సంబంధించిన క్రయ దస్తావేజులు ఉన్నాయని, కొంతమందికి అడంగల్ కాపీలు కూడా ఉన్నాయని వివరించారు. భూములకు సంబంధించిన కొన్ని రికార్డులను వీఆర్‌ఓ తారుమారు చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, రైతులను న్యాయం చేస్తామన్నారు.



రైతులు ఇచ్చిన వినతిపత్రాన్ని చదువుతున్న ఎమ్మెల్యే గంటా

ఈకార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సింగనబంద సర్పంచ్ గాడు నారాయణ, టీడీపీ నాయకులు జి. తాతినాయుడు, నీలాపు సూర్యనారాయణ, కనకల వెంకటరమణ, అల్లు చిన్నయ్య, సంకురుబోతు ప్రకాశ్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు



క్రీడాకారులతో ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

ఎండాడ/సాగర్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల జీన్స్‌లోనే విలు విద్య క్రీడ ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గీతం వైద్య కళాశాల మైదానంలో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి విలు విద్య (ఆర్చరీ మీట్) పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందని చెప్పారు. కాగా ఓవరాల్ ఛాంపియన్‌గా ఒడిశా నిలవగా తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. విజేతలకు టీఎస్ఆర్ఎం ఈడీ రాణిముండా బహుమతులు ఇచ్చారు.

ముగిసిన తొలి విడత చందనం అరగదీత

సింహాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తొలి విడత చందనం అరగదీతను సిబ్బంది మూడు రోజుల్లో ముగించారు. ఈనెల 24న ప్రత్యేక పూజలు తరువాత ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు చందనం అరగదీతకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు 30 కిలోలు, రెండో రోజు 48 కిలోలు, మూడో రోజు 50 కిలోలు చందనాన్ని అరగదీశారు. ఆలయ నాల్గవ తరగతి ఉద్యోగులు తీసిన చందనపు ముద్దను ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో స్థానాచార్యులు రాజగోపాల్ శనివారం తూనిక వేసి పద్మనిధి (బాండాగారం)లో భద్రపరిచారు. అందులో కొన్ని వన మూలికల మిశ్రమాన్ని మిళితం చేసి, ఈనెల 30న రాత్రి జరిగే సహస్ర ఘటాభిషేకం తరువాత నాలుగు మణుగుల (సుమారు 125 కిలోల) శ్రీచందనపు ముద్దను స్వామివారికి తొలి విడతగా సమర్పించనున్నారు.

20న దేశ వ్యాప్త సమ్మె

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 20న దేశ వ్యాప్తంగా సమ్మె జరగనున్నట్టు సీఐటీయూ మండల ప్రతినిధి రవ్వ నరసింగరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

ఆనందపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజాలలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని ఆర్‌డీఓ సంగీత్ మాధుర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సర్వే నంబరు 332/2లో సుమారు 3. 5 ఎకరాల ప్రభుత్వ భూమిని నగరానికి చెందిన కొందరు వ్యక్తులు ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేసేశారు. కొనుగోలుదారులు ప్లాట్లకు ఫెన్సింగ్ కూడా వేశారు. ఆక్రమణకు గురైన ప్రాంతం ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ. 15 కోట్లు వరకూ ఉంటుంది. ఆర్‌డీఓ స్థలాన్ని పరిశీలించి, హెచ్చరిక బోర్డు వేయించారు.

ఫ్యాబ్ సేవలు అభినందనీయం : సీఐ

భీమునిపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సీఐ తిరుమలరావు అన్నారు. శనివారం కుమ్మరిపాలెం ఇండోర్ స్టేడియం వద్ద ఫ్యాబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యాబ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 70 బెంచీలను ఏర్పాటు చేశారన్నారు. ది సన్ స్కూల్ అధినేత కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఫ్యాబ్ చేస్తున్న సేవలను కొనియాడారు.కార్యక్రమంలో ఫ్యాబ్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ముసునూరి శ్రీనివాసరావు, గోపి, పెంటపల్లి దేవానంద్, గుగ్గిళ్ళ సాయి, వి. సత్యనారాయణ, కట్టమూరి అశోక్, రమణారావు, ఫాల్గుణ పాల్గొన్నారు.

ఉగ్ర దాడిపై నిరసన ర్యాలీ

భీమునిపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని తరిమికొట్టడానికి దేశ ప్రజలంతా ముందుకు రావాలని స్వచ్ఛంద సంస్థలు నినదించాయి. శనివారం సాయంత్రం హిందూ ధర్మ పరిరక్షణ సమితి, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి ఆధ్వర్యంలో కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా నూకాలమ్మ ఆలయం నుంచి మెయిన్ రోడ్, గంటస్తంభం మీదుగా బీచ్‌రోడ్ లైట్ హౌస్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ భద్రతకు ముప్పుగా మారిన ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్, ఫోరం ఫర్ బెటర్ భీమిలి,మిషన్ గ్రీన్ భీమిలి, అర్చక సంఘం, వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం, కళాసాహితి, బార్ అసోసియేషన్ సభ్యులతో పాటు ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, నరేంద్రకుమార్, సింగరాచార్యులు, కామేశ్వర సూర్యశ్రీనివాసరావు, పార్వతీశం,కృష్ణమూర్తి, నరసింగరావు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ఫిల్మ్ క్లబ్బు...రాజకీయ గబ్బు

... 5వ పేజీ తరువాయి

(పాత సర్వే నంబరు 336) ఐదు ఎకరాలు కేటాయిస్తూ 2019మార్చి 7న జీఓ వచ్చింది. అందులో 'లీజు' అనే అంశం లేకపోవడం వల్ల అధికారులు భూమి అప్పగించలేదు. ఎకరాకు రూ.2 లక్షలు చొప్పున ఏడాదికి రూ.10 లక్షలు చెల్లించేలా నాడు ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా ఆ భూమి క్లబ్‌కు వచ్చేలా చూస్తానని వారికి గంటా హామీ ఇచ్చారు. అయితే కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో ఫిల్మ్ క్లబ్‌కు భూమి కేటాయించాలంటూ విష్ణుకుమార్‌రాజు పాత జీఓ నంబర్లు, నాటి విషయాలు ఉటంకిస్తూ ఇన్‌చార్జి మంత్రి వీరాంజనేయస్వామికి, కలెక్టర్‌లకు ఒక లేఖ రాసి ఇచ్చారు. దానిపై విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ సంతకాలు చేశారు. ఈ విషయం గంటా శ్రీనివాసరావుకు చెప్పలేదు.

క్లబ్ వాట్సాప్ గ్రూపులో ప్రచారం

మంత్రికి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇచ్చిన లేఖను ప్రస్తుత క్లబ్ అధ్యక్షులు ఆర్‌వీ చంద్రమౌళిప్రసాద్ 1,600 మంది సభ్యులు కలిగిన క్లబ్ వాట్సాప్ గ్రూపులో పెట్టారు. మంత్రికి బీజేపీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ అధికారికంగా ఇచ్చిన లేఖ అని, త్వరలోనే భూమి వస్తుందని పేర్కొన్నారు. అందులో కొందరు సభ్యులు దానిని గంటా శ్రీనివాసరావుకు పంపించి, ఈ విషయం మీకు తెలుసా?...అని ప్రశ్నించారు. అంత వరకూ మంత్రికి లేఖ ఇచ్చిన విషయం గంటాకు తెలియదు. అంతేకాకుండా శుక్రవారం జరిగిన డీఆర్‌సీ సమావేశంలో భీమిలి నియోజకవర్గంలో మాస్టర్‌ప్లాన్ రహదారి పనులపై టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం కూడా ఆయన దృష్టికి వెళ్లింది. ఇదే క్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఓటు వేయడానికి రావాలనే విషయాన్ని కూడా ముందుగా చెప్పకుండా శనివారం ఉదయం ఫోన్ చేయడంపైనా ఆయన అసంతృప్తికి లోనయ్యారు. వీటన్నింటి నేపథ్యంలో శనివారం జీవీఎంసీకి వెళ్లి సమావేశంలో పాల్గొని బయటకు వస్తున్నప్పుడు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఎదురై మంత్రికి లేఖ ఇచ్చిన విషయం ప్రస్తావించారు. దాంతో గంటా ఒక్కసారి భగ్గుమన్నారు. తన నియోజకవర్గానికి సంబంధించిన విషయంపై తనతో చర్చించాల్సిన అవసరం లేదా? అని నిలదీశారు. అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం అంటూ విష్ణుకుమార్‌రాజు సమర్థించుకోవాలని చూడగా, ఆ లేఖను క్లబ్ సభ్యుల వాట్సాప్ గ్రూపులో పెట్టిన విషయాన్ని గుర్తు చేసి మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు నూకాలమ్మ నెల పండగ

భీమునిపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలో నూకాలమ్మ నెల పండగను ఆదివారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అల్లిపిల్లి వేణుబాబు, యెచ్చర్ల హరి తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

మే 12 నుంచి బంగారమ్మ పండగ

పద్మనాభం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రెడ్డిపల్లిలో వచ్చే నెల 12, 13, 14వ తేదీల్లో బంగారమ్మ తల్లి పండగ జరగనుంది. ఈమేరకు ఉత్సవ పోస్టర్లను ఎమ్మెల్యే గంటా శనివారం భీమిలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలు నిర్వహించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

ఎయిమ్స్ తరహాలో కేజీహెచ్

... 5వ పేజీ తరువాయి

విధంగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి తొలుత ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి స్వాగతం పలకగా, సెంటినరీ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు భవనం నిర్మాణానికి చేపట్టిన కార్యక్రమాలు, పూర్వవిద్యార్థుల విరాళాల గురించి వివరించారు. మొత్తం 1.4 ఎకరాల్లో రూ.50 కోట్లతో నిర్మించిన భవన సముదాయంలోని రెండు బ్లాక్‌లలో నాలుగు అంతస్థులు ఉన్నాయన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ భవనం కోసం గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు.ముందుచూపు ఉన్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశాఖపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ తాను కళాశాల పూర్వ విద్యార్థి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడును సెంటినరీ కమిటీ సత్కరించింది. హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎన్టీఆర్ వైద్య సేవా వైస్ చైర్మన్ సుధాకర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.చంద్రశేఖర్, డీఎంఈ నరసింహం, కమిటీ సభ్యులు డాక్టర్ శశిప్రభ, ఎస్కే అప్పారావు, పెదవీర్రాజు, వెంకటాచలం, టి. రాధ, దేవీమాధవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద, తదితరులు పాల్గొన్నారు.



యువతికి నియామకపు పత్రం అందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

రోజ్‌గార్ మేళాల్లో 10 లక్షల మందికి ఉద్యోగాలు

కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఎంపికైన వారికి ఉద్యోగ నియామకపు పత్రాలు అందజేయడానికి రోజ్‌గార్ మేళాలు నిర్వహించడం వల్ల అభ్యర్థులకు ఏడాదికాలం కలసి వస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు అన్నారు. విశాఖపట్నంలోని సాగరిక కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై 278 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, జీవితపు కొత్త ప్రయాణంలో పెద్ద లక్ష్యాలను సాధించడానికి నూతనోత్సాహంతో పనిచేయాలన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాల నుంచి వచ్చినవారు సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఇప్పటివరకూ పది లక్షల మందికి నియామకపు ఉత్తర్వులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ జీఎస్టీ జోన్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, విశాఖపట్నం కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీధర్, గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి. ఆనందకుమార్, నాసిన్ అడిషనల్ డైరెక్టర్ ఈదర రవికుమార్, పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, తదితరులు

భీమునిపట్నం,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మంగమారిపేట ఆరాధ్య దేవత ఎర్నిమాంబ ఉత్సవాల పోస్టర్‌ను ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గరికిన యల్లయ్య (కింగ్) ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు నగరంలో ఎంపీ, ఎమ్మెల్యేను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మే 3 నుంచి 8 వరకూ ఉత్సవాలు జరుగుతాయన్నారు. 3న తొలేళ్లు, 4న అనుపోత్సవం ఉంటుందని తెలిపారు. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

వందేళ్ల వేడుక

... 5వ పేజీ తరువాయి

ప్లేస్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. నిబద్ధతతో పని చేస్తామని, ఏడాదిపాటు నిర్వహించే శతాబ్ది వేడుకలకు నోబెల్ గ్రహీతలను ఆహ్వానిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏయూపై స్వయంగా ఆయన రాసిన కవితను చదివి వినిపించారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని వాటిని సాధించే దిశగా పనిచేయాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం తరఫున వర్సిటీ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తామని చైర్మన్ కేవీవీ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, మాజీ వీసీలు బీల సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, శశిభూషణ్, ప్రిన్సిపాల్స్ ఎంవీఆర్ రాజు, సత్యనారాయణతోపాటు పలు విభాగాధిపతులు,పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ, మాజీ ప్రొఫెసర్ బి.ప్రసాదరావును సన్మానించారు. సెంటినరీ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి నిర్వహించిన సెంటినరీ లోగో పోటీలకు సంబంధించిన విజేతను ప్రకటించారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి షేక్ రఫీ రూపొందించిన లోగోను ఏడాదిపాటు నిర్వహించనున్న వేడుకలకు వినియోగిస్తామని వీసీ ప్రకటించారు.

రాష్ట్రానికే తలమానికం : సీపీ

రాష్ట్రానికే ఏయూ తలమానికంగా నిలిచిందని, ఇది అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు.శనివారం ఉదయం ఏయూ పరిపాలనా భవనం వద్ద శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వ్యవస్థాపక ఉప కులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన బెలూన్‌ను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు. వీసీతోపాటు ఏయూ అధికారులు ఏయూ పరిపాలనా భవనం, సిరిపురం కూడలి వద్ద ఉన్న సీఆర్ రెడ్డి విగ్రహాలకు, మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్, ఏపీ పాత్రతో సహా పలువురు ప్రముఖుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హై అలర్ట్

... 5వ పేజీ తరువాయి

రైల్వే పోలీస్ (జీఆర్‌పీ)తోపాటు రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) సంయుక్తంగా శనివారం తనిఖీలు చేపట్టాయి. అన్ని ప్లాట్‌ఫారాలను స్నిఫర్ డాగ్‌లతో జల్లెడ పట్టించారు. అలాగే ప్రయాణికుల వివరాలు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైల్వే పార్శిళ్లను కూడా బాంబ్ డిటెక్టర్లతో స్కానింగ్ చేశారు. విశాఖలో ఆర్కే బీచ్, జగదాంబ జంక్షన్, రైల్వేస్టేషన్‌ను ఉగ్రవాదులు లక్ష్యంగా ఎంచుకునే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, కేంద్ర ఇంటెలిజెన్స్ హెచ్చరించినట్టు సోషల్ మీడియాలో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. అయితే అదంతా వాస్తవం కాదని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఫలానా ప్రాంతంలో హైఅలర్ట్‌గా ఉండాలంటూ ఎలాంటి హెచ్చరికలు ఇంతవరకూ అందలేదని డీజీపీ జారీచేసినట్టుగా ఒక ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

స్టీల్‌ప్లాంటులో భద్రత కట్టుదిట్టం

ఉక్కుటౌన్‌షిప్ : కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో స్టీల్‌ప్లాంటులో భద్రతను కట్టుదిట్టం చేశారు. స్టీల్‌ప్లాంటు ప్రధాన గేటు, విస్తరణ గేటు, బీసీ గేటు, ప్లాంటు లోపల కీలక విభాగాల వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ప్లాంటులోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

... 5వ పేజీ తరువాయి

హాజరుకావడంతో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నియమ నిబంధనలను సభ్యులకు ఎన్నికల అధికారి వివరించారు. అనంతరం అవిశ్వాసానికి మద్దతు తెలిపే సభ్యులు చేతులెత్తాలని కోరగా, 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు చేతులు ఎత్తారు. అవిశ్వాసానికి వ్యతిరేకించేవారు, తటస్థంగా ఉన్నవారు చేతులెత్తాలని కోరగా ఎవరూ స్పందించలేదు. దీంతో అవిశ్వాసం నెగ్గడానికి అవసరమైన 74 మంది మద్దతు లభించడంతో డిప్యూటీ మేయర్ పదవిని శ్రీధర్ కోల్పోయినట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఈనెల 19న మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం కూడా 74 మంది సభ్యుల మద్దతుతో నెగ్గడంతో ఆమె పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఈనెల 28న నూతన మేయర్ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశారు.

భక్తి శ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు

ఆరిలోవ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : శనిత్రయోదశి పురస్కరించుకొని ఆరిలోవలోని శివాలయంలో గల నవగ్రహాలకు శనివార శనికి తైలాభిషేకాలు నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో వెలిసిన నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. దోష పరిహారార్థం ఈ పూజలు నిర్వహించినట్టు ఆలయ ట్రస్టీ కృష్ణంరాజు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య(గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ),అరుణ(పెదగంట్యాడ), తాతా (తగరపు వలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక) **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 14, క్యారెట్ 35 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 24, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా ఏపీ

▸▸ సీఐఐ సదస్సులో ఏపీ ప్రభుత్వ అంతరిక్ష, రక్షణ రంగ తయారీ రంగాల గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలన్నీ రక్షణ రంగం, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెడుతున్నాయని, ఈ నేపథ్యంలో భారతదేశంలో ఆయా రంగాలకు చెందిన పరిశ్రమలకు మంచి భవిష్యత్తు ఉందని ఏపీ ప్రభుత్వ అంతరిక్ష, రక్షణ రంగ తయారీ రంగాల గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి అన్నారు. ఏపీ ప్రభుత్వం సానుకూల విధానాల వల్ల ఆయా ఉత్పత్తుల తయారీ కేంద్రంగా మారే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) సంయుక్తంగా శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, అంతరిక్షం తదితర రంగాల్లో ఇన్నోవేషన్ క్లస్టర్లు, ప్లగ్ అండ్ ప్లే టెస్టింగ్ కేంద్రాలు, టెక్నాలజీకి సంబంధించిన ఎక్స్‌లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విశాఖపట్నంలో వీటన్నింటికీ అత్యధిక అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా సముద్ర గర్భ పరిశోధనలకు కీలక కేంద్రంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐడీఎం చైర్మన్ జె.శ్రీనివాసరాజు మాట్లాడుతూ, విశాఖపట్నం సమీపంలో మేరీటైమ్ ఇండస్ట్రియల్ పార్క్ రానుందన్నారు. సీఐఐ విశాఖ జోన్ చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు మాట్లాడుతూ విశాఖపట్నం గ్లోబల్ హబ్‌గా మారేందుకు సీఐఐ తన వంతు సహకారం అందిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఏపీ గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి. చిత్రంలో ఎస్ఐడీఎం ఏపీ చైర్మన్ జె.శ్రీనివాసరాజు, సీఐఐ విశాఖ చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు

18న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు

▸ మేయర్ ఎన్నిక నేపథ్యంలో నిర్ణయం
▸ కలెక్టరేట్, జోనల్ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్టు ప్రకటన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ పదవికి ఈ నెల 28న (సోమవారం) జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.ఈ కారణంగా.. ఆ రోజు నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో రద్దు చేసినట్టు విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం, జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాల్లో 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యథాలాపంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. నగర వాసులు గమనించాలని కోరారు.

ఎట్టకేలకు పార్కు స్థలంలో కబ్జా తొలగింపు



పార్కులోని కబ్జాను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

వెంకోజీపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని భానునగర్‌లో 450 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, వెంటనే కబ్జాను తొలగించి పార్కు స్థలాన్ని తమకు అప్పగించాలని భానునగర్ అసోసియేషన్ నివాసుల పోరాటానికి ఫలితం దక్కింది. ఎట్టకేలకు శనివారం పార్కు స్థలంలోని కబ్జాను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీసు పహారాతో స్థలంలోని కబ్జాను తొలగించి వేశారు. ఈ పార్కు కబ్జాపై 'ఆంధ్రజ్యోతి'లో అనేకసార్లు కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించి, చొరవ చూపి సమస్య పరిష్కారానికి సహకరించిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టౌన్ సర్వేయర్ ఎస్. తిరుపతిరావు, సచివాలయం డబ్ల్యుపీ ముత్యమాంబలకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ స్థలంలో మిగిలిన చిన్న బిల్డింగ్‌ను కూడా లీగల్ ఒపీనియన్‌తో తొలగిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు.

ఈ స్థలంలో శంకుస్థాపన చేసి పార్కు గాని, కాలనీ వాసుల అవసరాల నిమిత్తం సామాజిక భవనం గాని నిర్మించనున్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. దీనిలో ఏసీపీ మధుసూదనరావు, ఇతర సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం కాలనీ వాసులంతా కలిసి తమకు సహకరించిన జీవీఎంసీ సీసీపీ ప్రభాకరావును కలిసి శాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు వంకా శివశంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, ఒమ్మి నాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా ఇతర కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభం

పాఠశాలల పునఃప్రారంభం నాడు విద్యార్థులకు అందజేస్తాం: డీఈవో



గాజువాకలో పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

గాజువాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల సరఫరాను శనివారం గాజువాకలోని పంపిణీ కార్యాలయంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. తొలి విడతగా పద్మనాభం, భీమిలి,ఆనందపురం మండలాలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా అన్ని పాఠశాలలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను ఎంఈవో కార్యాలయాలకు చేరుతాయని, అక్కడ నుంచి మండల పరిధిలోగా స్కూళ్లకు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున అన్ని తరగతులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది త్వరగానే పాఠ్య పుస్తకాల ప్రారంభాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ జర్నలిస్టుల శాంతి ర్యాలీ


ఆరిలోవ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ఆరిలోవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జమ్ము కశ్మీర్‌లో సమీపంలోని పహల్గామ్‌లో భారతీయ పర్యాటకులపై పాకిస్తాన్‌కి చెందిన ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులు జరపిన ఘటనను నిరసిస్తూ ఆరిలోవ జర్నలిస్టు అసోసియేషన్, వాకర్స్ అసోసియేషన్, ముస్లిం సోదరులు కలిసి శనివారం ఉదయం నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. పర్యాటకులపై ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం అవివేకమని అన్నారు. ఇలాంటి దాడులకు కారణమైన వ్యక్తులు, ఉగ్రవాద సంస్థలకు భారత్ ప్రభుత్వం సరైన సమాధానం ఇచ్చి తీరాలన్నారు.ఈ కాల్పుల్లో అమరుడైన విశాఖ వాసి చంద్రమౌళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ ర్యాలీ ఆరిలోవ ప్రెస్ క్లబ్ నుంచి దీనదయాళ్‌పురం మీదుగా చినగదిలి షిర్డీ సాయిబాబా గుడి, హెల్త్ సిటీ రోడ్డు మీదుగా సాగింది. అధిక సంఖ్యలో స్థానికులు సైతం పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తి ఆధ్వర్యంలో...

ఆరిలోవ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు పాశవికంగా దాడికి పాల్పడి ప్రాణాలను తీయడం దుర్మార్గమని సేవా స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు అన్నారు. ఉగ్రదాడులను నిరసిస్తూ శనివారం రవీంద్రనగర్‌లోని సేవాస్ఫూర్తి కార్యాలయంలో అప్పలరాజు ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల చర్యను ఖండించారు. ఉగ్రవాదుల దుశ్చర్యను యావత్ప్రపంచం ఖండిస్తోందన్నారు. ఇలాంటి మారణకాండకు తెగబడిన వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

అన్న సమారాధన


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు సతీమణి సృజన

పెదవాల్తేరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సతీమణి సృజన విచ్చేసి ప్రారంభించారు. ఆమె స్వయంగా భక్తులకు వడ్డించారు. అనంతరం ఆమె పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు. అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల ఆకలి తీర్చే అన్నదానం చేయడం ఎంతో శ్రేష్ఠమైనదన్నారు. కార్యక్రమంలో దేవలయం ఈవో కె.గాయత్రి, దేవస్థానం అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, శ్రీహరిసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో పడి బాలుడి మృతి


సాయి (ఫైల్)

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం సమీపంలో గల ఏలేరు కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఉమెన్ ఎస్ఐ రమణమ్మ శనివారం తెలిపిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన కూండ్రపు సాయి(14) ఈ నెల 23న తాళ్లపాలెంలో ఉన్న తమ బంధువులైన అమరిపిల్లి అప్పారావు ఇంటికి వివాహ వేడుకకు వచ్చాడు. ఆ బాలుడు పెదవాల్తేరులోని ఓం శాంతి ఆశ్రమంలో చెవిటి, మూగ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడు ఈ నెల 25న ఉదయం 11 గంటల సమయంలో కాలకృత్యాల కోసం తాళ్లపాలెం ఏలేరు కాలువ గట్టుకు వెళ్తున్నానని తల్లి కూండ్రపు ఆదిలక్ష్మికి చెప్పి వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో వెతకగా శనివారం ఉదయం 6 గంటల సమయంలో కోన నాగేశ్వరరావు మామిడితోట వద్ద ఉన్న ఏలేరు కాలువలో మృతదేహం తేలి ఉందని చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లిఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ చెప్పారు. ప్రమాదవశాత్తూ జారి పడిపోవడంతోనే సాయి మృతి చెందాడని అతని తల్లి ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



మద్దిలపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ నిర్వహించిన ఇంటర్నేషనల్ డ్యాన్స్ డేలో 18 మంది గురువుల వద్ద అభ్యాసం చేసిన నాట్యమణులు శాస్త్రీయ నృత్యాలతో మంత్రముగ్ధులను చేశారు. దేవుని కృతులకు ముఖ కవళికల్లో అద్భుత అభినయం ప్రదర్శిస్తూ ప్రేక్షకులను కట్టిపడేశారు. నట్టువాంగానికి అనునయిస్తూ నయనాల కదలికలతో మైమరిపించారు. నాట్య మణుల నృత్య ప్రదర్శనలకు చప్పట్లతో కళాభారతి ప్రాంగణం మారుమోగింది. అనంతరం.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశాఖ చాప్టర్ క్రెడిట్ అధ్యక్షుడు ధరేంద్ర, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ నృత్య దినోత్సవం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణరావు, గోపీనాథ్, మంజూష, సింధుజ, మహాలక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యంతో అభివృద్ధి

రామ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక నిర్వహణ, కమ్యూనికేషన్, డేటా విశ్లేషణ నైపుణ్యంతో శక్తివంతమైన అభివృద్ధి సాధ్య పడుతుందని ప్రేమ్‌జీ స్కూల్ ఆఫ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.మిశ్రా పేర్కొన్నారు. శనివారం మహారాణిపేట గోకుల్ పార్కు వద్ద ఒక సమావేశమందిరంలో డెవలప్‌మెంట్ లీడర్ షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ సమానత్వం, న్యాయం కోసం కృషి చేయడం ద్వారా సుస్థిరతకు దోహదపడే ప్రత్యామ్నాయ అభివృద్ధిని ఊహించే సామర్థ్యం పెరుగుతుందన్నారు. సహకార పద్ధతులతో నిర్మించిన సంస్థలో చేరడం ద్వారా నాయకత్వ నైపుణ్యాలు మెరుగుపడ తాయని, ఎన్జీవోలకు సామాజిక ఉద్యమాలు గ్రామీణ సంఘటనలతో పని చేసున్న వారికి దోహదపడుతుందని తెలిపారు.

వీఎంఆర్డీఏ దుకాణాలు, కార్యాలయాల కేటాయింపునకు 13న వేలం

సిరిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పరిధిలోని దుకాణాలు, కార్యాలయాలు, ఖాళీ స్థలాలు నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇచ్చేందుకు నిర్ణయించడం జరిగిందని వీఎంఆర్డీఏ కార్యదర్శి తెలిపారు. సదరు షాపులు, కార్యాలయాలు, కాళీ స్థలాలు బహిరంగ వేలం పాట ద్వారా నిర్ణయించే ధరకు అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటి విస్తీరం, అద్దె తదితర విషయాలను వీఎంఆర్డీఏ వైబ్‌సెట్ డబ్లుడబ్లుడబ్లు.వీఎంఆర్డీఏ.జీఓవీ.ఇన్ పొందుపరచడమైందన్నారు. కాల పరిమితి కోసం నెలసరి అద్దె ప్రతిపదికపై వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను వీఎంఆర్డీఏ కార్యాలయం 8వ అంతస్తులోని రెవెన్యూ విభాగంలో పొందవచ్చన్నారు. మే 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. బహిరంగ వేలం మే 13న ఉదయం 11 గంటలకు సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

చంపుతానని బెదిరించినందుకు కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేఆర్‌ఎం కాలనీకి చెందిన వివాహిత ఫిర్యాదు మేరకు ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్ సమీపంలో ఉంటున్న సాలిగ్రాము సతీష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలలా ఉన్నాయి. కొన్నాళ్ల క్రితం సతీష్‌తో వివాహిత సన్నిహితంగా ఉండేది. ఆర్థిక లావాదేవీల కారణంగా క్రితం ఏడాది మే 3న ఆమెపై సతీష్ హత్యాయత్నం చేశాడు.

అప్పట్లో అతడిపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మళ్లీ ఈ నెల 9న ఆమె ఇంటికి వచ్చి బెదిరించాడు. మరోసారి ఫోన్ చేసి చంపేస్తానంటూ బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఖాదర్ బాషా పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎస్‌సీ వాజీ ఐపీటీవీ, వాచో వాజీ ఓటీటీ సేవలు ప్రారంభం



వాచో వాజీ సేవల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాజీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి నీడి శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, 'ఆంధ్రజ్యోతి' విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు

సిరిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అత్యాధునిక సేవలను అందించడంలో సుదీర్ఘ కాలంగా వాజీ ఛానెల్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆశీలమెట్టలోని వాజీ కార్యాలయంలోని ఎస్ఎస్‌సీ వాజీ ఐటీటీవీ, వాచో వాజీ ఓటీటీ సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వాజీ ఛానెల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి నీడి శ్రీనివాసరావుతో కలిసి ఓటీటీ సేవలను ప్రారంభించారు. ముందుగా పోస్టర్‌ను వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ ఆవిష్కరించగా, ఛానల్ ప్రసారాలను 'ఆంధ్రజ్యోతి' విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణారావు రిమోట్ ద్వారా ప్రారంభించారు.

వాజీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి నీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో వస్తున్న ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటూ భవిష్యత్‌ను మరింత ఆశాజనకంగా మార్చుకోవాలన్నారు. 30 ప్లస్ ఓటీటీలు, 111 ప్లస్ చానల్‌లు ఒకే తెరపై చూసేందుకు ఎస్ఎస్‌సీ వాజీ ఐపీటీవీ, వాచో వాజీ ఓటీపీలు అనువైన ప్లాట్‌ఫామ్‌లన్నారు. మధ్య తరగతి వారికి అందుబాటు ధరల్లో అంతర్జాల సేవలతో కేబులు ప్రసారాలను అందించేందుకు వినూత్నరీతిలో వీటిని ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఆర్థిక సహాయం

▸ ఎన్ఎస్ఈ ఎం.డి. ఆశిష్‌కుమార్ వితరణ

రామ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్య అని ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ కుమార్ అన్నారు.ఉగ్రదాడిలో మృతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళికి శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియపారు. ఇది దేశం మరువజాలని విషాదం అన్నారు. ఈ సమయంలో మన దేశం కలసికట్టుగా నడవాలని, బాధిత కుబుంబాలకు అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా.. మృతుల కుటుంబాలకు తమ వంతుగా రూ.నాలుగు లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్టు ప్రకటించారు.

జంట హత్యలపై సీఎం చంద్రబాబు ఆరా!

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కూర్మన్నపాలెంలోని రాజీవ్ నగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసు గురించి సీఎం చంద్రబాబునాయుడు ఆరా తీసినట్టు తెలిసింది. కేజీహెచ్‌లో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభి చేందుకు శనివారం నగరానికి వచ్చిన ఆయన బీచ్ రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో ఈ విషయమై మాట్లాడినట్టుసమాచారం. అనంతరం కేజీహెచ్‌కు చేరుకున్న చంద్రబాబు అక్కడ ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తుండగా, తన వెనక ఉన్న సీపీ శంఖబ్రత బాగ్చిని చూసిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆయన వద్దకు వెళ్లి జంట హత్యల గురించి అడిగారు. దీనికి సీపీ స్పందిస్తూ హత్యలు జరిగిన విషయం ఒకరోజు తర్వాత బయటకు వచ్చిందని, కేసుదర్యాప్తులో ఉందనివివరించారు.

కేవీ విద్యార్థిని నృత్య ప్రతిభ



ముంబయిలో అవార్డు అందుకుంటున్న రిషిక

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.రిషిక నృత్యంలో ప్రథమస్థానంలో నిలిచి అవార్డు అందుకుంది. ముంబయిలో పద్మ విభూషణ్ యామిని కృష్ణమూర్తి స్మారక ఆలిండియా డాన్స్ పోటీల్లో అంతరంగ్ ఉత్సవ్‌లో విశేష ప్రతిభ కనబరిచింది. డాన్సులో పలుమార్లు అవార్డులు అందుకున్న రిషికాను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



సీతమ్మధార, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో గల కూడలిలో గేరా రాంబాబు అతని స్నేహితులు చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వద్ద ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరంకారీ మండల్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ రాంచంద్ మిర్చురీ తెలిపారు. సద్గురు బాబా గురుబచన్ సింగ్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, యువత ఇందులో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మే 10, 11 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మాధవధార, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) విశాఖ జిల్లా 25వ మహాసభలు మే 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మాధవధారలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 10న మురళీనగర్‌లో ప్రతినిధుల సమావేశం, 11న కంచరపాలెం ఐటిఐ జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. మహా సభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి ముఖ్య వక్తలుగా హాజరవుతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు లక్ష్యంగా మహాసభలు జరుగుతాయని తెలిపారు.

దళితుల బహిష్కరణను ఖండించండి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం మల్లామ్ గ్రామంలో దళితుల బహిష్కరణపై జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపింది. సంఘం నాయకుడు వై.రాజు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నియోజకవర్గంలోనే ఇంతఘోరం జరగడం సిగ్గుచేటన్నారు. ఘటనపై పవన్ స్పందించకపోవడం చూస్తుంటే దళితులపై ఆయన వ్యతిరేకత తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఎర్రిబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

హైఅలర్ట్

... 5వ పేజీ తరువాయి

రైల్వే పోలీస్ (జీఆర్‌పీ)తోపాటు రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) సంయుక్తంగా శనివారం తనిఖీలు చేపట్టాయి. అన్ని ప్లాట్‌ఫారాలను స్నిపర్ డాగ్‌లతో జల్లెడ పట్టించారు. అలాగే ప్రయాణికుల వివరాలు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైల్వే పార్శిళ్లను కూడా బాంబ్ డిటెక్టర్లతో స్కానింగ్ చేశారు. విశాఖలో ఆర్కే బీచ్, జగదాంబ జంక్షన్, రైల్వేస్టేషన్‌ను ఉగ్రవాదులు లక్ష్యంగా ఎంచుకునే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, కేంద్ర ఇంటెలిజెన్స్ హెచ్చరించినట్టు సోషల్ మీడియాలో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. అయితే అదంతా వాస్తవం కాదని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఫలానా ప్రాంతంలో హైఅలర్ట్‌గా ఉండాలంటూ ఎలాంటి హెచ్చరికలు ఇంతవరకూ అందలేదని డీజీపీ జారీచేసినట్టుగా ఒక ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

స్టీల్‌ప్లాంటులో భద్రత కట్టుదిట్టం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో స్టీల్‌ప్లాంటులో భద్రతను కట్టుదిట్టం చేశారు. స్టీల్‌ప్లాంటు ప్రధాన గేటు, విస్తరణ గేటు, బీసీ గేటు, ప్లాంటు లోపల కీలక విభాగాల వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ప్లాంటులోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

మానవత్వమే అసలైన మతం



ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ శంకరమఠం రోడ్డులో ప్లేవుడ్, గ్లాస్ అండ్ లామినేట్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల ర్యాలీ



ఉగ్రదాడి మృతులకు బుల్లయ్య కళాశాలలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట/ సీతమ్మధార, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మానవత్వమే నిజమైన మతమని, ప్రపంచ శాంతిని నెలకొల్పడంలో అన్ని మతాలు కృషి చేయాలని ప్రముఖులు అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల్లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలిజియస్ ఫ్రీడమ్, యునైటెడ్ రెలిజియన్స్, గాంధీ సెంటర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతుల ఆత్మశాంతి కోరుతూ మౌనం పాటించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత వీసీ ఆచార్య ఏవీఎస్ ప్రసాదరావు, గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. సంఘాల ప్రతినిధులు విశాలాక్షి, ప్రజ్ఞాన కుమార్, జైన్, అనురాధ, నరసింహారావు, విశ్వనాథం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం ప్లేవుడ్, గ్లాస్ అండ్ లామినేట్స్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుకాణాలు మూసివేసి ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. శంకరమఠం రోడ్డు శాంతిపురం జాతీయ రహదారి కూడలి నుంచి డైమండ్ పార్కు వరకు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. పాక్ దుందుడుకు చర్యలను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా దేశ ప్రజల మద్దతు ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధి వినీత్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. ప్రతినిధులు రాజు, రమేష్, రాజేష్ పాటిల్, భూపెస్, శ్రవణ్, విష్ణు, చిరంజీవి, మిల్లెన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు. సీతమ్మధార కూడలి అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మృతులకు నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ ప్రతినిధులు ఎస్.మధురెడ్డి, పడాల గోవింద్, రావికృష్ణ, కృష్ణంనాయుడు, రావి అశోక్ పాల్గొన్నారు.

వయోవృద్ధులను ప్రత్యేక దృష్టితో చూడండి

మహారాణిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టానికి సంబంధించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు డివిజన్, మండల స్థాయిలో సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. వృద్ధులకు ఆసుపత్రులు, దేవాలయాలలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, ఒంటరిగా నివసిస్తున్న వయో వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తమకు అందే ఫిర్యాదులపై పోలీసు యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారికి అందేలా చూడాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగ పథకాల అమలుకు ప్రతీ శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణ ఉండాలని, వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. వారి హక్కులు చట్టాలు పక్కాగా అమలు జరగాలని నిర్దేశించారు. దివ్యాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పాలన్నారు.

మార్కెట్‌లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్-350 క్లాసిక్ బైక్



బైక్ ఆవిష్కరిస్తున్న సీతారాం మోటార్స్ అధినేత జీవీవీ సీతారామయ్య

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్-350 మోడల్ బైక్‌ను దొండపర్తిలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌లో సీతారాం మోటార్స్ అధినేత జీవీవీ సీతారామయ్య శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బైక్ యువతకు తగ్గట్టుగా సరికొత్తగా, సహజ సిద్ధమైన శక్తివంతమైన ఇంజన్, సిటీ డ్రైవ్ కోసం రూపొందించినట్లు చెప్పారు. ఇప్పటి వరకూ 15 వేల బైకులను విక్రయించినట్లు చెప్పారు. ఈ బైక్ రూ.1.49 లక్షలు ఎక్స్ షోరూమ్ ధరగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ సీతారాం చౌదరి, జి. నరేంద్ర చౌదరి, ఏరియా సేల్స్ మేనేజర్ జె.కల్యాణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్ సేవలు అనన్యం

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



వానపల్లి రవికుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ శ్రీభరత్ తదితరులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తుదిశ్వాస వరకు ప్రజా సేవకే వానపల్లి రవికుమార్ అంకితమయ్యారని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ శ్లాఘించారు. శనివారం రవికుమార్ 4వ వర్ధంతి కార్యక్రమాన్ని డాబాగార్డెన్స్‌లో ఆయన సతీమణి వానపల్లి గాయత్రి ఫణికుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హాజరై వానపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా టీడీపీలో ఉంటూ, కార్పొరేటర్‌గా, స్వచ్ఛంద సేవకునిగా రవికుమార్ ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ కుటుంబ సభ్యులు, నాని తదితరులు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి

మహారాణిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): క్యాథలిక్ మతాధిపతి పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం జరిగిన నేపథ్యంలో విశాఖ అగ్రపీఠం కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ నెల 21న వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ మరణించిన సంగతి తెలిసిందే. మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ చర్చి వద్ద గల విశాఖ అగ్రపీఠం కార్యాలయ ప్రాంగణంలో విశ్రాంత పీఠాధిపతి మల్లవరపు ప్రకాష్ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ యావత్ ప్రపంచానికి దేవుని సేవకుడు, క్రైస్తవ లోకానికి మార్గ చూపరి పోప్ ఫ్రాన్సిస్ అని అభివర్ణించారు. పోప్ మరణ వార్త విషాదం నింపిందన్నారు. 11 సంవత్సరాలుగా పోప్ శాంతి సందేశాలు, దైవ సేవకుడిగా ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. 88 సంవత్సరాల వయసులోనూ దైవ సేవ చేస్తూ దైవ సన్నిధికి చేరిన గొప్ప వ్యక్తి అని కీర్తించారు. సెయింట్ ఆంథోనీ చర్చిలో ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు జొన్నాడ జాన్ ప్రకాష్, జయరాజ్, రత్నకుమార్, రవితేజ, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.



మహారాణిపేటలో పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫాదర్లు

మండుటెండలో మహిళల నిరసన



మద్యం దుకాణం వద్దంటూ నినదిస్తున్న మహిళలు, స్థానికులు

కంచరపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ మండుటెండను సైతం లెక్కచేయకుండా జీవీఎంసీ 48వవార్డు పరిధి ఇందిరానగర్-4 గ్రామస్థులు, మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. నివాసిత ప్రాంతాలు, గుడులు, బడులు ఉన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాన్ని ఎలా పెడతారని నిర్వాహకుల తీరును ప్రశ్నించారు. ఇరుగ్గా ఉండే సర్వీస్ రోడ్డులో.. రెండు వైపులా పిల్లాపాపలతో వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. తమ గ్రామంలో మద్యం దుకాణాన్ని ఎట్టి పరిస్థితిల్లో పెట్టనివ్వబోమని మహిళలు తేల్చిచెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఇక్కడ దుకాణం పెట్టడానికి యత్నిస్తే గ్రామస్థులంతా నిరసన గళం విప్పడంతో అప్పటి పాలకులు ఆలోచన విరమించుకున్నారని గుర్తుచేశారు. దుకాణం ఏర్పాటు కానివ్వకుండా చూడాలని గ్రామ పెద్దలు పద్మ, అమ్మాజీ, చినబాబు,యశోదరావు, త్రినాథ్ విజ్ఞప్తి చేశారు.

రూ.70 కోట్లకు 'స్నేహ మాక్స్' టోపీ

... 5వ పేజీ తరువాయి



తమ డిపాజిట్లు తిరిగి ఇవ్వాలంటూ సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

వద్ద ఆందోళనకు దిగారు. డిపాజిట్‌దారుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు పిరుబండి ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి బోని అప్పారావులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2008లో కటికల శివ భాగ్యారావు స్నేహ మాక్స్ సంస్థను ఏర్పాటుచేశాడు. ఎస్సీ, ఎస్టీలకు ఆ సంస్థలో ఉద్యోగాలిచ్చాడు. స్నేహ మాక్స్ కో-ఆపరేటివ్ సంస్థలో విశ్రాంత ఉద్యోగులతో డిపాజిట్లు కట్టించారు. బ్యాంకుల్లో కేవలం 7 శాతం వడ్డీ ఇస్తారని, అదే స్నేహ మాక్స్ సంస్థలో డిపాజిట్ చేస్తే 12 శాతం వడ్డీ వస్తుందని నమ్మించాడు. ఇలా పలు సంస్థల విశ్రాంత ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ డిపాజిట్లు కట్టించాడు. కొద్ది నెలలు వడ్డీని సక్రమంగానే ఇచ్చాడు. వడ్డీ కూడా తమ సంస్థలోనే డిపాజిట్ చేసే మరింత అధికంగా డబ్బులు వస్తాయని నమ్మించాడు. ఇలా సుమారు 300 మంది వద్ద నుంచి రూ.70 కోట్లు సేకరించాడు. ఎనిమిది నెలల నుంచి సీతంపేట సంస్థలో కనిపించకుండా హైదరాబాద్‌కు మకాం మార్చేశాడు. వడ్డీ, కట్టిన డిపాజిట్లు అడిగితే అదిగో, ఇదిగో...అంటూ తప్పించుకున్నాడు. దీంతో 160 మంది బాధిత డిపాజిట్‌దారులు సంఘంగా ఏర్పడ్డారు. తమకు న్యాయం చేయాలని నగర పోలీసు కమిషనర్‌ను అభ్యర్థించగా దువ్వాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని (బాధితులంతా ఆ స్టేషన్ పరిధిలో ఉన్నారు) సూచించడంతో స్నేహ మాక్స్ సంస్థపైన, యజమాని భాగ్యారావు, కొందరు డైరెక్టర్లపై ఫిర్యాదు చేసినట్టు వివరించారు. ఆందోళన కార్యక్రమంలో బాధిత డిపాజిట్ పరిరక్షణదారుల సంఘం ప్రతినిధులు జె.వి. ప్రభాకర్, నక్కా రత్నరాజు, బాల భాస్కర్‌రావు, బీర బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

జగదల్‌పూర్-కొత్తవలస సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని జగదల్‌పూర్, కొత్తవలస సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా శనివారం తనిఖీలు చేశారు. ఈ సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, భద్రతా అంశాలు, స్టేషన్ అభివృద్ధి కార్యకలాపాలను పరిశీలించారు. విండో ట్రయలింగ్ ద్వారా ట్రాక్‌ల పరిస్థితి, మలుపులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించారు. అలాగే ఈ సెక్షన్‌లోని ఎన్ఎండీసీ మైనింగ్ కార్యకలాపాలకు సంబంధించి రైల్వే చేపట్టే వివిధ పనులపై సమీక్షించారు. అనంతరం సరుకు రవాణా లోడింగ్ కార్యకలాపాలను మెరుగుపరచడంపై ఎన్ఎండీసీ అధికారులతో చర్చించారు. వ్యాగన్ లోడింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించడం, సామర్థ్యాన్ని పెంచడం, ట్రాఫిక్ పరంగా వ్యాగన్ డిశ్చార్జ్ వ్యవస్థను మెరుగుపరచడంపై సమీక్షించారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో చీఫ్ ఇంజనీర్ (కనస్ట్రక్షన్) గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం



వాల్తేరు రైల్వే ఏర్పాటు చేసిన పరుగు పందెంలో పాల్గొన్న మహిళలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్ విభాగాల మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ మీట్ శనివారం ప్రారంభమైంది. రైల్వే ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలకు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష ముఖ్య అతిథిగా హాజరై పరుగు పందేన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులలో మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగించే స్పోర్ట్సు మేళాలో ఈ ఏడాది అత్యధికంగా అథ్లెటిక్స్ పోటీల్లో ఔత్సాహికులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. వాల్తేరు రైల్వే నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రతిభ గలవారికి ప్రత్యేక ప్రోత్సాహాలు అందించేందుకు డీఆర్ఎం లలిత్ బొహ్రా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే అథ్లెటిక్స్ కార్యదర్శి శ్రీకాంత్, కోచ్ సూర్య, సీనియర్ అథ్లెట్లు నరేంద్ర, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిరోజు మహిళలకు 100, 200, 400 మీ. పరుగు పందేలు జరిగాయి.

రోజ్‌గార్ మేళాల్లో 10 లక్షల మందికి ఉద్యోగ నియామక పత్రాలు



యువతికి నియామకపు పత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఎంపికైన వారికి ఉద్యోగ నియామకపు పత్రాలు అందజేయడానికి రోజ్‌గార్ మేళాలు నిర్వహించడం వల్ల అభ్యర్థులకు ఏడాదికాలం కలసి వస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. విశాఖపట్నంలోని సాగరిక కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై 278 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, జీవితపు కొత్త ప్రయాణంలో పెద్ద లక్ష్యాలను సాధించడానికి నూతనోత్సాహంతో పనిచేయాలన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాల నుంచి వచ్చినవారు సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటివరకూ పది లక్షల మందికి పైగా యువతకు నియామకపు ఉత్తర్వులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ జీఎస్టీ జోన్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, విశాఖపట్నం కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్, గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనందకుమార్, నాసిన్ అడిషనల్ డైరెక్టర్ ఈదర రవికుమార్ పాల్గొన్నారు.

వేదం పరమాత్మ స్వరూపం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేదం పరమాత్మ స్వరూపమని బాలా త్రిపుర సుందరి దేవి సేవాసదన్ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ అక్కాజోస్యుల రమేష్‌శర్మ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవస్థానం వేదికగా శనివారం రమేష్ శర్మ సారథ్యంలో సనాతన చతుర్వేద పారాయణాన్ని 15 మంది వేద పండితులతో కలిసి శాస్త్రోక్తంగా, ముక్త కంఠంతో పఠించారు. టీటీడీ ప్రతినిధి గుల్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠీ ఆదేశాల మేరకు టీటీడీ, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈవో జీవీ రమాబాయి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడ వేద పారాయణం జరుగుతుందో అక్కడ లోక కల్యాణం సిద్ధిస్తుందని రమేష్‌శర్మ అన్నారు. రెండు రోజులుగా వేదోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మూడో రోజు సామూహిక సంపూర్ణ వేద పారాయణంతో ఘనంగా ముగిసింది. వేద పండితులను, ఘనా పాఠీలను, క్రమా పాఠీలను సంప్రదాయరీతిలో సత్కరించారు. అర్చకుడు భార్గవశర్మ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫిల్మ్ క్లబ్బు...రాజకీయ గబ్బు

... 5వ పేజీ తరువాయి

(పాత సర్వే నంబరు 336) ఐదు ఎకరాలు కేటాయిస్తూ 2019మార్చి 7న జీఓ వచ్చింది. అందులో 'లీజు' అనే అంశం లేకపోవడం వల్ల అధికారులు భూమి అప్పగించలేదు. ఎకరాకు రూ.2 లక్షలు చొప్పున ఏడాదికి రూ.10 లక్షలు చెల్లించేలా నాడు ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా ఆ భూమి క్లబ్‌కు వచ్చేలా చూస్తానని వారికి గంటా హామీ ఇచ్చారు. అయితే కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో ఫిల్మ్ క్లబ్‌కు భూమి కేటాయించాలంటూ విష్ణుకుమార్‌రాజు పాత జీఓ నంబర్లు, నాటి విషయాలు ఉటంకిస్తూ ఇన్‌చార్జి మంత్రి వీరాంజనేయస్వామికి, కలెక్టర్‌లకు ఒక లేఖ రాసి ఇచ్చారు. దానిపై విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ సంతకాలు చేశారు. ఈ విషయం గంటా శ్రీనివాసరావుకు చెప్పలేదు.

క్లబ్ వాట్సాప్ గ్రూపులో ప్రచారం

మంత్రికి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇచ్చిన లేఖను ప్రస్తుత క్లబ్ అధ్యక్షులు ఆర్‌వీ చంద్రమౌళి ప్రసాద్ 1,600 మంది సభ్యులు కలిగిన క్లబ్ వాట్సాప్ గ్రూపులో పెట్టారు. మంత్రికి బీజేపీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ అధికారికంగా ఇచ్చిన లేఖ అని, త్వరలోనే భూమి వస్తుందని పేర్కొన్నారు. అందులో కొందరు సభ్యులు దానిని గంటా శ్రీనివాసరావుకు పంపించి, ఈ విషయం మీకు తెలుసా?...అని ప్రశ్నించారు. అంత వరకూ మంత్రికి లేఖ ఇచ్చిన విషయం గంటాకు తెలియదు. అంతేకాకుండా శుక్రవారం జరిగిన డీఆర్‌సీ సమావేశంలో భీమిలి నియోజకవర్గంలో మాస్టర్‌ప్లాన్ రహదారి పనులపై టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం కూడా ఆయన దృష్టికి వెళ్లింది. ఇదే క్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఓటు వేయడానికి రావాలనే విషయాన్ని కూడా ముందుగా చెప్పకుండా శనివారం ఉదయం ఫోన్ చేయడంపైనా ఆయన అసంతృప్తికి లోనయ్యారు. వీటన్నింటి నేపథ్యంలో శనివారం జీవీఎంసీకి వెళ్లి సమావేశంలో పాల్గొని బయటకు వస్తున్నప్పుడు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఎదురై మంత్రికి లేఖ ఇచ్చిన విషయం ప్రస్తావించారు. దాంతో గంటా ఒక్కసారి భగ్గుమన్నారు. తన నియోజకవర్గానికి సంబంధించిన విషయంపై తనతో చర్చించాల్సిన అవసరం లేదా? అని నిలదీశారు. అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం అంటూ విష్ణుకుమార్‌రాజు సమర్థించుకోవాలని చూడగా, ఆ లేఖను క్లబ్ సభ్యుల వాట్సాప్ గ్రూపులో పెట్టిన విషయాన్ని గుర్తు చేసి మరింత ఆగ్రహం వ్యక్తంచేశారు.

వందేళ్ల వేడుక

... 5వ పేజీ తరువాయి

ప్లేస్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. నిబద్ధతతో పనిచేస్తామని, ఏడాదిపాటు నిర్వహించే శతాబ్ది వేడుకలకు నోబెల్ గ్రహీతలను ఆహ్వానిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏయూపై స్వయంగా ఆయన రాసిన కవితను చదివి వినిపించారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని వాటిని సాధించే దిశగా పనిచేయాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున వర్సిటీ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తామని చైర్మన్ కేవీవీ రావు అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, రెక్టార్ ఎస్.కిశోర్‌బాబు, మాజీ వీసీలు బీల సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, శశిభూషణ్, ప్రిన్సిపాల్స్ ఎంవీఆర్ రాజు, సత్యనారాయణతోపాటు పలు విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ, మాజీ ప్రొఫెసర్ బి.ప్రసాదరావును సన్మానించారు.సెంటినరీ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి నిర్వహించిన సెంటినరీ లోగో పోటీలకు సంబంధించిన విజేతను ప్రకటించారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి షేక్ రఫీ రూపొందించిన లోగోను ఏడాదిపాటు నిర్వహించనున్న వేడుకలకు వినియోగిస్తామని వీసీ ప్రకటించారు.

రాష్ట్రానికే తలమానికం: పోలీస్ కమిషనర్

రాష్ట్రానికే తలమానికంగా ఏయూ నిలిచిందని, ఇది అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఏయూ పరిపాలనా భవనం వద్ద శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శతాబ్ది ఉత్సవా లకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన బెలూన్‌ను ఎగురవేశారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు. వీసీ, ఏయూ అధికారులు పరిపాలనా భవనం, సిరిపురం కూడలి వద్ద ఉన్న సీఆర్ రెడ్డి విగ్రహాలకు, మహాత్మాగాంధీ, బీఆర్అంబేడ్కర్, ఏపీ పాత్రతో సహా పలువురు ప్రముఖుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎయిమ్స్ తరహాలో కేజీహెచ్

... 5వ పేజీ తరువాయి

విధంగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి తొలుత ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి స్వాగతం పలకగా, సెంటినరీ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు భవనం నిర్మాణానికి చేపట్టిన కార్యక్రమాలు, పూర్వవిద్యార్థుల విరాళాల గురించి వివరించారు. మొత్తం 1.4 ఎకరాల్లో రూ.50 కోట్లతో నిర్మించిన భవన సముదాయంలోని రెండు బ్లాక్‌లలో నాలుగు అంతస్తులు ఉన్నాయన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ భవనం కోసం గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ముందుచూపు ఉన్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశాఖపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ తాను కళాశాల పూర్వ విద్యార్థి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడును సెంటినరీ కమిటీ సత్కరించింది. హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎన్టీఆర్ వైద్య సేవా వైస్ చైర్మన్ సుధాకర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.చంద్రశేఖర్, డీఎంఈ నరసింహం, కమిటీ సభ్యులు డాక్టర్ శశిప్రభ, ఎస్కే అప్పారావు, పెదవీర్రాజు, వెంకటాచలం, టి.రాధ, దేవీమాధవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

... 5వ పేజీ తరువాయి

హాజరుకావడంతో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నియమ నిబంధనలను సభ్యులకు ఎన్నికల అధికారి వివరించారు. అనంతరం అవిశ్వాసానికి మద్దతు తెలిపే సభ్యులు చేతులెత్తాలని కోరగా, 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు చేతులు ఎత్తారు. అవిశ్వాసానికి వ్యతిరేకించేవారు, తటస్థంగా ఉన్నవారు చేతులెత్తాలని కోరగా ఎవరూ స్పందించలేదు. దీంతో అవిశ్వాసం నెగ్గడానికి అవసరమైన 74 మంది మద్దతు లభించడంతో డిప్యూటీ మేయర్ పదవిని శ్రీధర్ కోల్పోయినట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఈనెల 19న మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం కూడా 74 మంది సభ్యుల మద్దతుతో నెగ్గడంతో ఆమె పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఈనెల 28న నూతన మేయర్ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశారు.

రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా ఏపీ

సీఐఐ సదస్సులో ఏపీ ప్రభుత్వ అంతరిక్ష, రక్షణ రంగ తయారీ రంగాల గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలన్నీ రక్షణ రంగం, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెడుతున్నాయని, ఈ నేపథ్యంలో భారతదేశంలో ఆయా రంగాలకు చెందిన పరిశ్రమలకు మంచి భవిష్యత్తు ఉందని ఏపీ ప్రభుత్వ అంతరిక్ష, రక్షణ రంగ తయారీ రంగాల గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి అన్నారు. ఏపీ ప్రభుత్వం సానుకూల విధానాల వల్ల ఆయా ఉత్పత్తుల తయారీ కేంద్రంగా మారే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) సంయుక్తంగా శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, అంతరిక్షం తదితర రంగాల్లో ఇన్నోవేషన్ క్లస్టర్లు, ప్లగ్ అండ్ ప్లే టెస్టింగ్ కేంద్రాలు, టెక్నాలజీకి సంబంధించిన ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విశాఖపట్నంలో వీటన్నింటికీ అత్యధిక అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా సముద్ర గర్భ పరిశోధనలకు కీలక కేంద్రంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐడీఎం చైర్మన్ జె.శ్రీనివాసరాజు మాట్లాడుతూ, విశాఖపట్నం సమీపంలో మేరీటైమ్ ఇండస్ట్రియల్ పార్క్ రానుందన్నారు. సీఐఐ విశాఖ జోన్ చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు మాట్లాడుతూ విశాఖపట్నం గ్లోబల్ హబ్‌గా మారేందుకు సీఐఐ తన వంతు సహకారం అందిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఏపీ గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి. చిత్రంలో ఎస్ఐడీఎం ఏపీ చైర్మన్ జె.శ్రీనివాసరాజు, సీఐఐ విశాఖ చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు

18న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు

- మేయర్ ఎన్నిక నేపథ్యంలో నిర్ణయం
- కలెక్టరేట్, జోనల్ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్టు ప్రకటన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ పదవికి ఈ నెల 28న (సోమవారం) జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.ఈ కారణంగా.. ఆ రోజు నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో రద్దు చేసినట్టు విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం, జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాల్లో 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యథాతాపంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. నగర వాసులు గమనించాలని కోరారు.

ఎట్టకేలకు పార్కు స్థలంలో కబ్జా తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని భానునగర్‌లో 450 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, వెంటనే కబ్జాను తొలగించి పార్కు స్థలాన్ని తమకు అప్పగించాలని భానునగర్ అసోసియేషన్ నివాసుల పోరాటానికి ఫలితం దక్కింది. ఎట్టకేలకు శనివారం పార్కు స్థలంలోని కబ్జాను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీసు పహారాతో స్థలంలోని కబ్జాను తొలగించి వేశారు. ఈ పార్కు కబ్జాపై 'ఆంధ్రజ్యోతి'లో అనేకసార్లు కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించి, చొరవ చూపి సమస్య పరిష్కారానికి సహకరించిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టౌన్ సర్వేయర్ ఎస్. తిరుపతిరావు, సచివాలయం డబ్ల్యూపీ ముత్యమాంబలకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ స్థలంలో మిగిలిన చిన్న బిల్డింగ్‌ను కూడా లీగల్ ఒపీనియన్‌తో తొలగిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు.

ఈ స్థలంలో శంకుస్థాపన చేసి పార్కు గాని, కాలనీ వాసుల అవసరాల నిమిత్తం సామాజిక భవనం గాని నిర్మించనున్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. దీనిలో ఏసీపీ మధుసూదనరావు, ఇతర సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం కాలనీ వాసులంతా కలిసి తమకు సహకరించిన జీవీఎంసీ సీసీపీ ప్రభాకరావును కలిసి శాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు వంకా శివశంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, ఒమ్మి నాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా ఇతర కాలనీ వాసులు పాల్గొన్నారు.


పార్కులోని కబ్జాను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభం

పాఠశాలల పునఃప్రారంభం నాడు విద్యార్థులకు అందజేస్తాం: డీఈవో

గాజువాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల సరఫరాను శనివారం గాజువాకలోని పంపిణీ కార్యాలయంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. తొలి విడతగా పద్మనాభం, భీమిలి,ఆనందపురం మండలాలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా అన్ని పాఠశాలలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను ఎంఈవో కార్యాలయాలకు చేరుతాయని, అక్కడ నుంచి మండల పరిధిలోగా స్కూళ్లకు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున అన్ని తరగతులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది త్వరగానే పాఠ్య పుస్తకాల ప్రారంభాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఉగ్రదాడిని నిరసిస్తూ జర్నలిస్టుల శాంతి ర్యాలీ

ఆరిలోవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జమ్ము కశ్మీర్‌లో సమీపంలోని పహల్గామాలో భారతీయ పర్యాటకులపై పాకిస్తాన్‌కి చెందిన ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఘటనను నిరసిస్తూ ఆరిలోవ జర్నలిస్టు అసోసియేషన్, వాకర్స్ అసోసియేషన్, ముస్లిం సోదరులు కలిసి శనివారం ఉదయం నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. పర్యాటకులపై ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం అవివేకమని అన్నారు. ఇలాంటి దాడులకు కారణమైన వ్యక్తులు, ఉగ్రవాద సంస్థలకు భారత్ ప్రభుత్వం సరైన సమాధానం ఇచ్చి తీరాలన్నారు.ఈ కాల్పుల్లో అమరుడైన విశాఖ వాసి చంద్రమౌళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ ర్యాలీ ఆరిలోవ ప్రెస్ క్లబ్ నుంచి దీనదయాళ్‌పురం మీదుగా చినగదిలి షిర్డీ సాయిబాబా గుడి, హెల్త్ సిటీ రోడ్డు మీదుగా సాగింది. అధిక సంఖ్యలో స్థానికులు సైతం పాల్గొన్నారు.


ఆరిలోవ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సేవా స్ఫూర్తి ఆధ్వర్యంలో...

ఆరిలోవ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు పాశవికంగా దాడికి పాల్పడి ప్రాణాలను తీయడం దుర్మార్గమని సేవా స్ఫూర్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు అన్నారు. ఉగ్రదాడులను నిరసిస్తూ శనివారం రవీంద్రనగర్‌లోని సేవాస్ఫూర్తి కార్యాలయంలో అప్పలరాజు ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల చర్యను ఖండించారు. ఉగ్రవాదుల దుశ్చర్యను యావత్ప్రపంచం ఖండిస్తోందన్నారు. ఇలాంటి మారణకాండకు తెగబడిన వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



మద్దిలపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ నిర్వహించిన ఇంటర్నేషనల్ డ్యాన్స్ డేలో 18 మంది గురువుల వద్ద అభ్యాసం చేసిన నాట్యమణులు శాస్త్రీయ నృత్యాలతో మంత్రముగ్ధులను చేశారు. దేవుని కృతులకు ముఖ కవళికల్లో అద్భుత అభినయం ప్రదర్శిస్తూ ప్రేక్షకులను కట్టిపడేశారు. నట్టువాంగానికి అనునయిస్తూ నయనాల కదలికలతో మైమరిపించారు. నాట్య మణుల నృత్య ప్రదర్శనలకు చప్పట్లతో కళాభారతి ప్రాంగణం మారుమోగింది. అనంతరం.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశాఖ చాప్టర్ క్రెడిట్ అధ్యక్షుడు ధరేంద్ర, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ నృత్య దినోత్సవం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణరావు, గోపీనాథ్, మంజూష, సింధుజ, మహాలక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు సతీమణి సృజన

పెదవాల్తేరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సతీమణి సృజన విచ్చేసి ప్రారంభించారు. ఆమె స్వయంగా భక్తులకు వడ్డించారు. అనంతరం అమె పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు. అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ భక్తుల ఆకలి తీర్చే అన్నదానం చేయడం ఎంతో శ్రేష్ఠమైనదన్నారు. కార్యక్రమంలో దేవలయం ఈవో కె.గాయత్రి, దేవస్థానం అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, శ్రీహరిసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో పడి బాలుడి మృతి


సాయి (ఫైల్)

కశింకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం సమీపంలో గల ఏలేరు కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఉమెన్ ఎస్ఐ రమణమ్మ శనివారం తెలిపిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన కూండ్రపు సాయి(14) ఈ నెల 23న తాళ్లపాలెంలో ఉన్న తమ బంధువులైన అమరిపిల్లి అప్పారావు ఇంటికి వివాహ వేడుకకు వచ్చాడు. ఆ బాలుడు పెదవాల్తేరులోని ఓం శాంతి ఆశ్రమంలో చెవిటి, మూగ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడు ఈ నెల 25న ఉదయం 11 గంటల సమయంలో కాలకృత్యాల కోసం తాళ్లపాలెం ఏలేరు కాలువ గట్టుకు వెళ్తున్నానని తల్లి కూండ్రపు ఆదిలక్ష్మికి చెప్పి వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో వెతకగా శనివారం ఉదయం 6 గంటల సమయంలో కోన నాగేశ్వరరావు మామిడితోట వద్ద ఉన్న ఏలేరు కాలువలో మృతదేహం తేలి ఉందని చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లిఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ చెప్పారు. ప్రమాదవశాత్తూ జారి పడిపోవడంతోనే సాయి మృతి చెందాడని అతని తల్లి ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆర్థిక నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యంతో అభివృద్ధి

రామ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక నిర్వహణ, కమ్యూనికేషన్, డేటా విశ్లేషణ నైపుణ్యంతో శక్తివంతమైన అభివృద్ధి సాధ్య పడుతుందని ప్రేమ్‌జీ స్కూల్ ఆఫ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.మిశ్రా పేర్కొన్నారు. శనివారం మహారాణిపేట గోకుల్ పార్కు వద్ద ఒక సమావేశమందిరంలో డెవలప్‌మెంట్ లీడర్ షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ సమానత్వం, న్యాయం కోసం కృషి చేయడం ద్వారా సుస్థిరతకు దోహదపడే ప్రత్యామ్నాయ అభివృద్ధిని ఊహించే సామర్థ్యం పెరుగుతుందన్నారు. సహకార పద్ధతులతో నిర్మించిన సంస్థలో చేరడం ద్వారా నాయకత్వ నైపుణ్యాలు మెరుగుపడ తాయని, ఎన్జీవోలకు సామాజిక ఉద్యమాలు గ్రామీణ సంఘటనలతో పని చేసున్న వారికి దోహదపడుతుందని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు

ఆరిలోవ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : శనిత్రయోదశి పురస్కరించుకొని ఆరిలోవలోని శివాలయంలో గల నవగ్రహాలకు శనివార శనికి తైలాభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో వెలిసిన నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. దోష పరిహారార్థం ఈ పూజలు నిర్వహించినట్టు ఆలయ ట్రస్టీ కృష్ణంరాజు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

- **సారంగపాణి జాతకం :** శారద, శ్రీరామ, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య(గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), సీతారామయ్య (పరవాడ),అరుణ(పెదగంట్యాడ), తాతా (తగరపు వలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక) **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 14, క్యారెట్ 35 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్ధచిక్కుడు 52, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 24, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

వీఎంఆర్డీఏ దుకాణాలు, కార్యాలయాల కేటాయింపునకు 13న వేలం

సిరిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పరిధిలోని దుకాణాలు, కార్యాలయాలు, ఖాళీ స్థలాలు నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇచ్చేందుకు నిర్ణయించడం జరిగిందని వీఎంఆర్డీఏ కార్యదర్శి తెలిపారు. సదరు షాపులు, కార్యాలయాలు, కాళీ స్థలాలు బహిరంగ వేలం పాట ద్వారా నిర్ణయించే ధరకు అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటి విస్తీరం, అద్దె తదితర విషయాలను వీఎంఆర్డీఏ వైబ్‌సైట్ డబ్లుడబ్లుడబ్లు.వీఎంఆర్డీఏ.జీఓవీ.ఇన్ పొందుపరచడమైందన్నారు. కాల పరిమితి కోసం నెలసరి అద్దె ప్రతిపదికపై వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను వీఎంఆర్డీఏ కార్యాలయం 8వ అంతస్తులోని రెవెన్యూ విభాగంలో పొందవచ్చన్నారు. మే 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. బహిరంగ వేలం మే 13న ఉదయం 11 గంటలకు సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

చంపుతానని బెదిరించినందుకు కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేఆర్ఎం కాలనీకి చెందిన వివాహిత ఫిర్యాదు మేరకు ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్ సమీపంలో ఉంటున్న సాలిగ్రాము సతీష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలలా ఉన్నాయి. కొన్నాళ్ల క్రితం సతీష్‌తో వివాహిత సన్నిహితంగా ఉండేది. ఆర్థిక లావాదేవీల కారణంగా క్రితం ఏడాది మే 3న ఆమెపై సతీష్ హత్యాయత్నం చేశాడు.

అప్పట్లో అతడిపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మళ్లీ ఈ నెల 9న ఆమె ఇంటికి వచ్చి బెదిరించాడు. మరోసారి ఫోన్ చేసి చంపేస్తానంటూ బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఖాదర్ బాషా పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎస్‌సీ వాజీ ఐపీటీవీ, వాచో వాజీ ఓటీటీ సేవలు ప్రారంభం



వాచో వాజీ సేవల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాజీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి నీడి శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, 'ఆంధ్రజ్యోతి' విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు

సిరిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అత్యాధునిక సేవలను అందించడంలో సుదీర్ఘ కాలంగా వాజీ ఛానెల్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆశీలమెట్టలోని వాజీ కార్యాలయంలోని ఎస్ఎస్‌సీ వాజీ ఐపీటీవీ, వాచో వాజీ ఓటీటీ సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వాజీ ఛానెల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి నీడి శ్రీనివాసరావుతో కలిసి ఓటీటీ సేవలను ప్రారంభించారు. ముందుగా పోస్టర్‌ను వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ ఆవిష్కరించగా, ఛానల్ ప్రసారాలను 'ఆంధ్రజ్యోతి' విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణారావు రిమోట్ ద్వారా ప్రారంభించారు.

వాజీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి నీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో వస్తున్న ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటూ భవిష్యత్‌ను మరింత ఆశాజనకంగా మార్చుకోవాలన్నారు. 30 ప్లస్ ఓటీటీలు, 111 ప్లస్ చానల్‌లు ఒకే తెరపై చూసేందుకు ఎస్ఎస్‌సీ వాజీ ఐపీటీవీ, వాచో వాజీ ఓటీపీలు అనువైన ప్లాట్‌ఫామ్‌లన్నారు. మధ్య తరగతి వారికి అందుబాటు ధరల్లో అంతర్జాల సేవలతో కేబులు ప్రసారాలను అందించేందుకు వినూత్నరీతిలో వీటిని ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఆర్థిక సహాయం

ఎన్ఎస్ఈ ఎం.డి. ఆశిష్‌కుమార్ వితరణ

రామ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్య అని ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ కుమార్ అన్నారు.ఉగ్రదాడిలో మృతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళికి శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియపారు. ఇది దేశం మరువజాలని విషాదం అన్నారు. ఈ సమయంలో మన దేశం కలసికట్టుగా నడవాలని, బాధిత కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా.. మృతుల కుటుంబాలకు తమ వంతుగా రూ.నాలుగు లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్టు ప్రకటించారు.

జంట హత్యలపై సీఎం చంద్రబాబు ఆరా!

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కూర్మన్నపాలెంలోని రాజీవ్ నగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసు గురించి సీఎం చంద్రబాబునాయుడు ఆరా తీసినట్టు తెలిసింది. కేజీహెచ్‌లో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభిం చేందుకు శనివారం నగరానికి వచ్చిన ఆయన బీచ్ రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో ఈ విషయమై మాట్లాడినట్టుసమాచారం. అనంతరం కేజీహెచ్‌కు చేరుకున్న చంద్రబాబు అక్కడ ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తుండగా, తన వెనక ఉన్న సీపీ శంఖబ్రత బాగ్చిని చూసిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అయన వద్దకు వెళ్లి జంట హత్యల గురించి అడిగారు. దీనికి సీపీ స్పందిస్తూ హత్యలు జరిగిన విషయం ఒకరోజు తర్వాత బయటకు వచ్చిందని, కేసుదర్యాప్తులో ఉందనివివరించారు.

కేవీ విద్యార్థిని నృత్య ప్రతిభ



ముంబయిలో అవార్డు అందుకుంటున్న రిషిక

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.రిషిక నృత్యంలో ప్రథమస్థానంలో నిలిచి అవార్డు అందుకుంది. ముంబయిలో పద్మ విభూషణ్ యామిని కృష్ణమూర్తి స్మారక ఆలిండియా డాన్స్ పోటీల్లో అంతరంగ్ ఉత్సవ్‌లో విశేష ప్రతిభ కనబరిచింది. డాన్సులో పలుమార్లు అవార్డులు అందుకున్న రిషికాను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



సీతమ్మధార, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో గల కూడలిలో గేరా రాంబాబు అతని స్నేహితులు చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వద్ద ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరంకారీ మండల్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ రాంచంద్ మిర్చురీ తెలిపారు. సద్గురు బాబా గురుబచన్ సింగ్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, యువత ఇందులో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మే 10, 11 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మాధవధార, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) విశాఖ జిల్లా 25వ మహాసభలు మే 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మాధవధారలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 10న మురళీనగర్‌లో ప్రతినిధుల సమావేశం, 11న కంచరపాలెం ఐటిఐ జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. మహా సభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి ముఖ్య వక్తలుగా హాజరవుతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు లక్ష్యంగా మహాసభలు జరుగుతాయని తెలిపారు.

దళితుల బహిష్కరణను ఖండించండి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం మల్లామ్ గ్రామంలో దళితుల బహిష్కరణపై జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపింది. సంఘం నాయకుడు వై.రాజు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నియోజకవర్గంలోనే ఇంతఘోరం జరగడం సిగ్గుచేటన్నారు. ఘటనపై పవన్ స్పందించకపోవడం చూస్తుంటే దళితులపై ఆయన వ్యతిరేకత తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఎర్రిబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

హై అలర్ట్

... 5వ పేజీ తరువాయి

రైల్వే పోలీస్ (జీఆర్‌పీ)తోపాటు రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) సంయుక్తంగా శనివారం తనిఖీలు చేపట్టాయి. అన్ని ప్లాట్‌ఫారాలను స్నిఫర్ డాగ్‌లతో జల్లెడ పట్టించారు. అలాగే ప్రయాణికుల వివరాలు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైల్వే పార్శిళ్లను కూడా బాంబ్ డిటెక్టర్లతో స్కానింగ్ చేశారు. విశాఖలో ఆర్కే బీచ్, జగదాంబ జంక్షన్, రైల్వేస్టేషన్‌ను ఉగ్రవాదులు లక్ష్యంగా ఎంచుకునే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, కేంద్ర ఇంటెలిజెన్స్ హెచ్చరించినట్టు సోషల్ మీడియాలో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. అయితే అదంతా వాస్తవం కాదని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఫలానా ప్రాంతంలో హైఅలర్ట్‌గా ఉండాలంటూ ఎలాంటి హెచ్చరికలు ఇంతవరకూ అందలేదని డీజీపీ జారీచేసినట్టుగా ఒక ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

స్టీల్‌ప్లాంటులో భద్రత కట్టుదిట్టం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో స్టీల్‌ప్లాంటులో భద్రతను కట్టుదిట్టం చేశారు. స్టీల్‌ప్లాంటు ప్రధాన గేటు, విస్తరణ గేటు, బీసీ గేటు, ప్లాంటు లోపల కీలక విభాగాల వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ప్లాంటులోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

మానవత్వమే అసలైన మతం



ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ శంకరమఠం రోడ్డులో ప్లేవుడ్, గ్లాస్ అండ్ లామినేట్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల ర్యాలీ



ఉగ్రదాడి మృతులకు బుల్లయ్య కళాశాలలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతంపేట/ సీతమ్మధార, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మానవత్వమే నిజమైన మతమని, ప్రపంచ శాంతిని నెలకొల్పడంలో అన్ని మతాలు కృషి చేయాలని ప్రముఖులు అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల్లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలిజియస్ ఫ్రీడమ్, యునైటెడ్ రెలిజియన్స్, గాంధీ సెంటర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతుల ఆత్మశాంతి కోరుతూ మౌనం పాటించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత వీసీ ఆచార్య ఏవీఎస్ ప్రసాదరావు, గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. సంఘాల ప్రతినిధులు విశాలాక్షి, ప్రజ్ఞాన కుమార్, జైన్, అనురాధ, నరసింహారావు, విశ్వనాథం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం ప్లేవుడ్, గ్లాస్ అండ్ లామినేట్స్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుకాణాలు మూసివేసి ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. శంకరమఠం రోడ్డు శాంతిపురం జాతీయ రహదారి కూడలి నుంచి డైమండ్ పార్కు వరకు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. పాక్ దుందుడుకు చర్యలను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా దేశ ప్రజల మద్దతు ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధి వినీత్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. ప్రతినిధులు రాజు, రమేష్, రాజేష్ పాటిల్, భూపెస్, శ్రవణ్, విష్ణు, చిరంజీవి, మిల్లెన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు. సీతమ్మధార కూడలి అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మృతులకు నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ ప్రతినిధులు ఎస్.మధురెడ్డి, పడాల గోవింద్, రావికృష్ణ, కృష్ణంనాయుడు, రావి అశోక్ పాల్గొన్నారు.

వయోవృద్ధులను ప్రత్యేక దృష్టితో చూడండి

మహారాణిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టానికి సంబంధించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు డివిజన్, మండల స్థాయిలో సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. వృద్ధులకు ఆసుపత్రులు, దేవాలయాలలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, ఒంటరిగా నివసిస్తున్న వయో వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తమకు అందే ఫిర్యాదులపై పోలీసు యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారికి అందేలా చూడాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగ పథకాల అమలుకు ప్రతీ శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణ ఉండాలని, వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. వారి హక్కులు చట్టాలు పక్కాగా అమలు జరగాలని నిర్దేశించారు. దివ్యాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్చాలన్నారు.

మార్కెట్‌లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్-350 క్లాసిక్ బైక్



బైక్ ఆవిష్కరిస్తున్న సీతారాం మోటార్స్ అధినేత జీవీవీ సీతారామయ్య

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్-350 మోడల్ బైక్‌ను దొండపర్తిలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌లో సీతారాం మోటార్స్ అధినేత జీవీవీ సీతారామయ్య శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బైక్ యువతకు తగ్గట్టుగా సరికొత్తగా, సహజ సిద్ధమైన శక్తివంతమైన ఇంజన్, సిటీ డ్రైవ్ కోసం రూపొందించినట్లు చెప్పారు. ఇప్పటి వరకూ 15 వేల బైకులను విక్రయించినట్లు చెప్పారు. ఈ బైక్ రూ.1.49 లక్షలు ఎక్స్ షోరూమ్ ధరగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ సీతారాం చౌదరి, జి. నరేంద్ర చౌదరి, ఏరియా సేల్స్ మేనేజర్ జె.కల్యాణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వానపల్లి రవికుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ శ్రీభరత్ తదితరులు

రవికుమార్ సేవలు అనన్యం

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తుదిశ్వాస వరకు ప్రజా సేవకే వానపల్లి రవికుమార్ అంకితమయ్యారని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ శ్లాఘించారు. శనివారం రవికుమార్ 4వ వర్ధంతి కార్యక్రమాన్ని డాబాగార్డెన్స్‌లో ఆయన సతీమణి వానపల్లి గాయత్రి ఫణికుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హాజరై వానపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా టీడీపీలో ఉంటూ, కార్పొరేటర్‌గా, స్వచ్ఛంద సేవకునిగా రవికుమార్ ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ కుటుంబ సభ్యులు, నాని తదితరులు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు ఘన నివాళి

మహారాణిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): క్యాథలిక్ మతాధిపతి పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం జరిగిన నేపథ్యంలో విశాఖ అగ్రపీఠం కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ నెల 21న వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ మరణించిన సంగతి తెలిసిందే. మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ చర్చి వద్ద గల విశాఖ అగ్రపీఠం కార్యాలయ ప్రాంగణంలో విశ్రాంత పీఠాధిపతి మల్లవరపు ప్రకాష్ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ యావత్ ప్రపంచానికి దేవుని సేవకుడు, క్రైస్తవ లోకానికి మార్గ చూపరి పోప్ ఫ్రాన్సిస్ అని అభివర్ణించారు. పోప్ మరణ వార్త విషాదం నింపిందన్నారు. 11 సంవత్సరాలుగా పోప్ శాంతి సందేశాలు, దైవ సేవకుడిగా ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. 88 సంవత్సరాల వయసులోనూ దైవ సేవ చేస్తూ దైవ సన్నిధికి చేరిన గొప్ప వ్యక్తి అని కీర్తించారు. సెయింట్ ఆంథోనీ చర్చిలో ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు జొన్నాడ జాన్ ప్రకాష్, జయరాజ్, రత్నకుమార్, రవితేజ, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.



మహారాణిపేటలో పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫాదర్లు

మండుటెండలో మహిళల నిరసన



మద్యం దుకాణం వద్దంటూ నినదిస్తున్న మహిళలు, స్థానికులు

కంచరపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ మండుటెండను సైతం లెక్కచేయకుండా జీవీఎంసీ 48వవార్డు పరిధి ఇందిరానగర్-4 గ్రామస్థులు, మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. నివాసిత ప్రాంతాలు, గుడులు, బడులు ఉన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాన్ని ఎలా పెడతారని నిర్వాహకుల తీరును ప్రశ్నించారు. ఇరుగ్గా ఉండే సర్వీస్ రోడ్డులో.. రెండు వైపులా పిల్లాపాపలతో వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. తమ గ్రామంలో మద్యం దుకాణాన్ని ఎట్టి పరిస్థితిల్లో పెట్టనివ్వబోమని మహిళలు తేల్చిచెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఇక్కడ దుకాణం పెట్టడానికి యత్నిస్తే గ్రామస్థులంతా నిరసన గళం విప్పడంతో అప్పటి పాలకులు ఆలోచన విరమించుకున్నారని గుర్తుచేశారు. దుకాణం ఏర్పాటు కానివ్వకుండా చూడాలని గ్రామ పెద్దలు పద్మ, అమ్మాజీ, చినబాబు,యశోదరావు, త్రినాథ్ విజ్ఞప్తి చేశారు.

రూ.70 కోట్లకు 'స్నేహ మాక్స్' టోపీ

... 5వ పేజీ తరువాయి



తమ డిపాజిట్లు తిరిగి ఇవ్వాలంటూ సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

వద్ద ఆందోళనకు దిగారు. డిపాజిట్‌దారుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు పిరుబండి ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి బోని అప్పారావులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2008లో కటికల శివ భాగ్యారావు స్నేహ మాక్స్ సంస్థను ఏర్పాటుచేశాడు. ఎస్సీ, ఎస్టీలకు ఆ సంస్థలో ఉద్యోగాలిచ్చాడు. స్నేహ మాక్స్ కో-ఆపరేటివ్ సంస్థలో విశ్రాంత ఉద్యోగులతో డిపాజిట్లు కట్టించారు. బ్యాంకుల్లో కేవలం 7 శాతం వడ్డీ ఇస్తారని, అదే స్నేహ మాక్స్ సంస్థలో డిపాజిట్ చేస్తే 12 శాతం వడ్డీ వస్తుందని నమ్మించాడు. ఇలా పలు సంస్థల విశ్రాంత ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ డిపాజిట్లు కట్టించాడు. కొద్ది నెలలు వడ్డీని సక్రమంగానే ఇచ్చాడు. వడ్డీ కూడా తమ సంస్థలోనే డిపాజిట్ చేసే మరింత అధికంగా డబ్బులు వస్తాయని నమ్మిండు. ఇలా సుమారు 300 మంది వద్ద నుంచి రూ.70 కోట్లు సేకరించాడు. ఎనిమిది నెలల నుంచి సీతంపేట సంస్థలో కనిపించకుండా హైదరాబాద్‌కు మకాం మార్చేశాడు. వడ్డీ, కట్టిన డిపాజిట్లు అడిగితే అదిగో, ఇదిగో...అంటూ తప్పించుకున్నాడు. దీంతో 160 మంది బాధిత డిపాజిట్‌దారులు సంఘంగా ఏర్పడ్డారు. తమకు న్యాయం చేయాలని నగర పోలీసు కమిషనర్‌ను అభ్యర్థించగా దువ్వాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని (బాధితులంతా ఆ స్టేషన్ పరిధిలో ఉన్నారు) సూచించడంతో స్నేహ మాక్స్ సంస్థపైన, యజమాని భాగ్యారావు, కొందరు డైరెక్టర్లపై ఫిర్యాదు చేసినట్టు వివరించారు. ఆందోళన కార్యక్రమంలో బాధిత డిపాజిట్ పరిరక్షణదారుల సంఘం ప్రతినిధులు జె.వి. ప్రభాకర్, నక్కా రత్నరాజు, బాల భాస్కర్‌రావు, బీర బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

జగదల్‌పూర్-కొత్తవలస సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని జగదల్‌పూర్, కొత్తవలస సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా శనివారం తనిఖీలు చేశారు. ఈ సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, భద్రతా అంశాలు, స్టేషన్ అభివృద్ధి కార్యకలాపాలను పరిశీలించారు. విండో ట్రయలింగ్ ద్వారా ట్రాక్‌ల పరిస్థితి, మలుపులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించారు. అలాగే ఈ సెక్షన్‌లోని ఎన్ఎండీసీ మైనింగ్ కార్యకలాపాలకు సంబంధించి రైల్వే చేపట్టే వివిధ పనులపై సమీక్షించారు. అనంతరం సరుకు రవాణా లోడింగ్ కార్యకలాపాలను మెరుగుపరచడంపై ఎన్ఎండీసీ అధికారులతో చర్చించారు. వ్యాగన్ లోడింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించడం, సామర్థ్యాన్ని పెంచడం, ట్రాఫిక్ పరంగా వ్యాగన్ డిశ్చార్జ్ వ్యవస్థను మెరుగుపరచడంపై సమీక్షించారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో చీఫ్ ఇంజనీర్ (కనస్ట్రక్షన్స్) గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్ విభాగాల మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ మీట్ శనివారం ప్రారంభమైంది. రైల్వే ఫుట్‌బాల్ అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలకు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష ముఖ్య అతిథిగా హాజరై పరుగు పందేన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులలో మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగించే స్పోర్ట్సు మేళాలో ఈ ఏడాది అత్యధికంగా అథ్లెటిక్స్ పోటీల్లో ఔత్సాహికులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. వాల్తేరు రైల్వే నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రతిభ గలవారికి ప్రత్యేక ప్రోత్సాహాలు అందించేందుకు డీఆర్ఎం లలిత్ బొహ్రా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే అథ్లెటిక్స్ కార్యదర్శి శ్రీకాంత్, కోచ్ సూర్య, సీనియర్ అథ్లెట్లు నరేంద్ర, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిరోజు మహిళలకు 100, 200, 400 మీ. పరుగు పందేలు జరిగాయి.



వాల్తేరు రైల్వే ఏర్పాటు చేసిన పరుగు పందెంలో పాల్గొన్న మహిళలు

రోజ్‌గార్ మేళాల్లో 10 లక్షల మందికి ఉద్యోగ నియామక పత్రాలు



యువతికి నియామకపు పత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఎంపికైన వారికి ఉద్యోగ నియామకపు పత్రాలు అందజేయడానికి రోజ్‌గార్ మేళాలు నిర్వహించడం వల్ల అభ్యర్థులకు ఏడాదికాలం కలసి వస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. విశాఖపట్నంలోని సాగరిక కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై 278 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, జీవితపు కొత్త ప్రయాణంలో పెద్ద లక్ష్యాలను సాధించడానికి నూతనోత్సాహంతో పనిచేయాలన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాల నుంచి వచ్చినవారు సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటివరకూ పది లక్షల మందికి పైగా యువతకు నియామకపు ఉత్తర్వులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ జీఎస్టీ జోన్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, విశాఖపట్నం కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్, గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనందకుమార్, నాసిన్ అడిషనల్ డైరెక్టర్ ఈదర రవికుమార్ పాల్గొన్నారు.

వేదం పరమాత్మ స్వరూపం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేదం పరమాత్మ స్వరూపమని బాలా త్రిపుర సుందరి దేవి సేవాసదన్ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ అక్కాజోస్యుల రమేష్‌శర్మ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవస్థానం వేదికగా శనివారం రమేష్ శర్మ సారథ్యంలో సనాతన చతుర్వేద పారాయణాన్ని 15 మంది వేద పండితులతో కలిసి శాస్త్రోక్తంగా, ముక్త కంఠంతో పఠించారు. టీటీడీ ప్రతినిధి గుల్లపల్లి దత్తాత్రేయ ఘనాపాఠీ ఆదేశాల మేరకు టీటీడీ, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈవో జీవీ రమాబాయి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడ వేద పారాయణం జరుగుతుందో అక్కడ లోక కల్యాణం సిద్ధిస్తుందని రమేష్‌శర్మ అన్నారు. రెండు రోజులుగా వేదోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మూడో రోజు సామూహిక సంపూర్ణ వేద పారాయణంతో ఘనంగా ముగిసింది. వేద పండితులను, ఘనా పాఠీలను, క్రమా పాఠీలను సంప్రదాయరీతిలో సత్కరించారు. అర్చకుడు భార్గవశర్మ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫిల్మ్ క్లబ్బు...రాజకీయ గబ్బు

... 5వ పేజీ తరువాయి

(పాత సర్వే నంబరు 336) ఐదు ఎకరాలు కేటాయిస్తూ 2019మార్చి 7న జీఓ వచ్చింది. అందులో 'లీజు' అనే అంశం లేకపోవడం వల్ల అధికారులు భూమి అప్పగించలేదు. ఎకరాకు రూ.2 లక్షలు చొప్పున ఏడాదికి రూ.10 లక్షలు చెల్లించేలా నాడు ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా ఆ భూమి క్లబ్‌కు వచ్చేలా చూస్తానని వారికి గంటా హామీ ఇచ్చారు. అయితే కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో ఫిల్మ్ క్లబ్‌కు భూమి కేటాయించాలంటూ విష్ణుకుమార్‌రాజు పాత జీఓ నంబర్లు, నాటి విషయాలు ఉటంకిస్తూ ఇన్‌చార్జి మంత్రి వీరాంజనేయస్వామికి, కలెక్టర్‌లకు ఒక లేఖ రాసి ఇచ్చారు. దానిపై విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ సంతకాలు చేశారు. ఈ విషయం గంటా శ్రీనివాసరావుకు చెప్పలేదు.

క్లబ్ వాట్సాప్ గ్రూపులో ప్రచారం

మంత్రికి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇచ్చిన లేఖను ప్రస్తుత క్లబ్ అధ్యక్షులు ఆర్‌వీ చంద్రమౌళి ప్రసాద్ 1,600 మంది సభ్యులు కలిగిన క్లబ్ వాట్సాప్ గ్రూపులో పెట్టారు. మంత్రికి బీజేపీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ అధికారికంగా ఇచ్చిన లేఖ అని, త్వరలోనే భూమి వస్తుందని పేర్కొన్నారు. అందులో కొందరు సభ్యులు దానిని గంటా శ్రీనివాసరావుకు పంపించి, ఈ విషయం మీకు తెలుసా?...అని ప్రశ్నించారు. అంత వరకూ మంత్రికి లేఖ ఇచ్చిన విషయం గంటాకు తెలియదు. అంతేకాకుండా శుక్రవారం జరిగిన డీఆర్‌సీ సమావేశంలో భీమిలి నియోజకవర్గంలో మాస్టర్‌ప్లాన్ రహదారి పనులపై టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం కూడా ఆయన దృష్టికి వెళ్లింది. ఇదే క్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఓటు వేయడానికి రావాలనే విషయాన్ని కూడా ముందుగా చెప్పకుండా శనివారం ఉదయం ఫోన్ చేయడంపైనా ఆయన అసంతృప్తికి లోనయ్యారు. వీటన్నింటి నేపథ్యంలో శనివారం జీవీఎంసీకి వెళ్లి సమావేశంలో పాల్గొని బయటకు వస్తున్నప్పుడు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఎదురై మంత్రికి లేఖ ఇచ్చిన విషయం ప్రస్తావించారు. దాంతో గంటా ఒక్కసారి భగ్గుమన్నారు. తన నియోజకవర్గానికి సంబంధించిన విషయంపై తనతో చర్చించాల్సిన అవసరం లేదా? అని నిలదీశారు. అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం అంటూ విష్ణుకుమార్‌రాజు సమర్థించుకోవాలని చూడగా, ఆ లేఖను క్లబ్ సభ్యుల వాట్సాప్ గ్రూపులో పెట్టిన విషయాన్ని గుర్తు చేసి మరింత ఆగ్రహం వ్యక్తంచేశారు.

వందేళ్ల వేడుక

... 5వ పేజీ తరువాయి

ప్లేస్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. నిబద్ధతతో పనిచేస్తామని, ఏడాదిపాటు నిర్వహించే శతాబ్ది వేడుకలకు నోబెల్ గ్రహీతలను ఆహ్వానిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏయూపై స్వయంగా ఆయన రాసిన కవితను చదివి వినిపించారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని వాటిని సాధించే దిశగా పనిచేయాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున వర్సిటీ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తామని చైర్మన్ కేవీవీ రావు అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, రెక్టార్ ఎస్.కిశోర్‌బాబు, మాజీ వీసీలు బీల సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, శశిభూషణ్, ప్రిన్సిపాల్స్ ఎంవీఆర్ రాజు, సత్యనారాయణతోపాటు పలు విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ, మాజీ ప్రొఫెసర్ బి.ప్రసాదరావును సన్మానించారు.సెంటినరీ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి నిర్వహించిన సెంటినరీ లోగో పోటీలకు సంబంధించిన విజేతను ప్రకటించారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి షేక్ రఫీ రూపొందించిన లోగోను ఏడాదిపాటు నిర్వహించనున్న వేడుకలకు వినియోగిస్తామని వీసీ ప్రకటించారు.

రాష్ట్రానికే తలమానికం: పోలీస్ కమిషనర్

రాష్ట్రానికే తలమానికంగా ఏయూ నిలిచిందని, ఇది అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఏయూ పరిపాలనా భవనం వద్ద శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శతాబ్ది ఉత్సవా లకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన బెలూన్‌ను ఎగురవేశారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు. వీసీ, ఏయూ అధికారులు పరిపాలనా భవనం, సిరిపురం కూడలి వద్ద ఉన్న సీఆర్ రెడ్డి విగ్రహాలకు, మహాత్మాగాంధీ, బీఆర్‌అంబేడ్కర్, ఏపీ పాత్రోతో సహా పలువురు ప్రముఖుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎయిమ్స్ తరహాలో కేజీహెచ్

... 5వ పేజీ తరువాయి

విధంగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి తొలుత ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి స్వాగతం పలకగా, సెంటినరీ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు భవనం నిర్మాణానికి చేపట్టిన కార్యక్రమాలు, పూర్వవిద్యార్థుల విరాళాల గురించి వివరించారు. మొత్తం 1.4 ఎకరాల్లో రూ.50 కోట్లతో నిర్మించిన భవన సముదాయంలోని రెండు బ్లాక్‌లలో నాలుగు అంతస్థులు ఉన్నాయన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ భవనం కోసం గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ముందుచూపు ఉన్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశాఖపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ తాను కళాశాల పూర్వ విద్యార్థి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడును సెంటినరీ కమిటీ సత్కరించింది. హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎన్టీఆర్ వైద్య సేవా వైస్ చైర్మన్ సుధాకర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.చంద్రశేఖర్, డీఎంఈ నరసింహం, కమిటీ సభ్యులు డాక్టర్ శశిప్రభ, ఎస్కే అప్పారావు, పెదవీర్రాజు, వెంకటాచలం, టి.రాధ, దేవీమాధవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

... 5వ పేజీ తరువాయి

హాజరుకావడంతో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నియమ నిబంధనలను సభ్యులకు ఎన్నికల అధికారి వివరించారు. అనంతరం అవిశ్వాసానికి మద్దతు తెలిపే సభ్యులు చేతులెత్తాలని కోరగా, 63 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు చేతులు ఎత్తారు. అవిశ్వాసానికి వ్యతిరేకించేవారు, తటస్థంగా ఉన్నవారు చేతులెత్తాలని కోరగా ఎవరూ స్పందించలేదు. దీంతో అవిశ్వాసం నెగ్గడానికి అవసరమైన 74 మంది మద్దతు లభించడంతో డిప్యూటీ మేయర్ పదవిని శ్రీధర్ కోల్పోయినట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఈనెల 19న మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం కూడా 74 మంది సభ్యుల మద్దతుతో నెగ్గడంతో ఆమె పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఈనెల 28న నూతన మేయర్ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశారు.



మాక్ డ్రిల్‌లో భాగంగా మంటలు ఆర్పుతున్న దృశ్యం

వీఎస్ఈజెడ్ సినర్జీస్‌లో అబ్బురపరిచిన మాక్‌డ్రిల్

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ వీఎస్ఈజెడ్ సినర్జీస్‌లో శనివారం ప్రమాదాల నివారణకు నిర్వహించిన మాక్‌డ్రిల్ చూపరులను అబ్బురపరిచింది. పరిశ్రమల్లో ఆకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు, రసాయనాలు వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు ఏర్పడితే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కార్మికులు తీసుకోవల సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఆగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పౌండర్ డీజీఎం భాగ్యలక్ష్మం మాట్లాడుతూ అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వివిధ నిర్మాణాలలో కార్మికులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు విపణీంద్ర, ఒమ్మి ఎల్లాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

పెదగంట్యాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి పీవీ రమణ తెలిపారు. సైన్స్‌కు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ శిబిరంలో పాల్గొని నూతన ఆవిష్కరణలు, వాటివల్ల ప్రయోజనాల గురించి దృశ్య శ్రవణ రూపంలో వివరిస్తారన్నారు. అలాగే భాషపై పట్టు సాధించేందుకు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లోని ప్రముఖ రచయితల కథలు చదివించడం, ఉత్సాహవంతులైన విద్యార్థులతో కథలు రాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రీడలతో పాటు బాలికలకు రంగవల్లుల పోటీలు నిర్వహించడం, తదితర కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అగనంపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్టీల్‌ప్లాంట్ రహదారిలోని నడక మైదానం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. నగరానికి చెందిన వీ హెల్త్ కేర్ సౌజన్యంతో ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ, షుగర్‌తో పాటు దంత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిత

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. సీఐటీయూ ప్లాంట్, ఐద్వా ఆధ్వర్యంలో మే డే సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం వల్ల స్టీల్‌ప్లాంటులో ప్రస్తుతం తీవ్ర ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు యు.రామస్వామి, మొహిద్దీన్, వెంకటరావు, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామాక్షి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (వడ్లపూడి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తారా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 20, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 26, క్యాబేజీ 14, క్యారెట్ 35 దొండకాయలు 18, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 20, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 52, దొస కాయలు 18, వెల్లుల్లి (పెద్ద) 100, కొబ్బరికాయ (పెద్ద) 25, బీన్స్ (సన్న) 56, కీర దోస 24, క్యాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్ద) 28, చేమదుంపలు 36 బీరగదుంపలు 34, కంద 80, చేమదు చిక్కుడు 64, గోరు చిక్కుడు 24, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండపనస 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, మెంతూకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్బూజాలు 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్డు (సెక్)

(డజను - రూ.లలో)	
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

జంట హత్యలపై వీడని మిస్టరీ!

8 బృందాలుగా ఏర్పడి విచారణ సాగిస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి రాజీవ్ నగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల జంట హత్యల కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. జంట హత్యలకు పాల్పడిన దుండగులు ఎక్కడా ఎలాంటి క్లూ లేకుండా జాగ్రత్త పడడంతో కేసును ఛేదించేందుకు పోలీస్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి డాగ్ స్క్వాడ్‌తో పాటు క్లూస్ టీమ్‌తో అన్ని కోణాల్లో కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు పోలీసులు 8 బృందాలుగా ఏర్పడి వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా హతుల కుటుంబాలతో పరిచయం ఉన్నవాళ్ల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. డీసీపీ, ఏసీపీ డి.లక్ష్మణరావు నేతృత్వంలో పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది రాజీవ్ నగర్‌లో తిష్ఠ వేసి జల్లెడ పడుతున్నారు. మృతులు గంపల యోగేంద్రబాబు (66), ఆయన భార్య లక్ష్మి (52) ఇక్కడ 30 ఏళ్లుగా నివాసముంటున్నారు. వారికి జరుగుపోయిన వారితో గానీ స్థానికంగా ఎవరితోనూ ఎటువంటి వివాదాలు లేవని కాలనీవాసులు చెబుతున్నారు. యోగేంద్రబాబు నేవల్ డాక్‌యార్డ్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. లక్ష్మి స్థానిక గ్రేస్ స్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారు. వీరిద్దరి



హత్యకు గురైన యోగేంద్రబాబు, లక్ష్మి (ఫైల్ ఫొటో)

పిల్లలైన సుజిత్, శిల్పలకు వివాహాలు కావడంతో అమెరికాలో స్థిరపడ్డారు. అందరితో స్నేహంగా ఉంటున్న ఈ దంపతులను ఎవరు, ఎందుకు హత్య చేశారన్నది పోలీసులకు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. కాగా వీరు వినియోగిస్తున్న స్కూటీ కనిపించకపోవడంతో దీని గురించి ఆరా తీస్తున్నారు. ఈ స్కూటీ మరమ్మతులకు గురైనప్పుడు స్థానిక మెకానిక్‌లు వద్ద దానిని తీసుకువెళ్లి బాగుచేశాక తెచ్చేవారన్న సమాచారం మేరకు పోలీసులు వారిని పిలిచి విచారిస్తున్నారు. హతుల ఇంటికి సమీపంలో సీసీ కెమెరాలు కూడా లేకపోవడం పోలీసులకు కేసు ఛేదన కష్టతరంగానే మారింది. దంపతుల ఇంట్లో నగదు, బంగారం ఏమైనా చోరీకి గురయ్యాయా, ఎవరు ఈ అమానుషానికి పాల్పడిందన్నది పోలీసుల దర్యాప్తులో వెలుగు చూడాల్సి ఉంది.

జంట హత్యలపై సీఎం చంద్రబాబు ఆరా!

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గ పరిధి కూర్మన్నపాలెంలోని రాజీవ్ నగర్‌లో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసు గురించి సీఎం చంద్రబాబునాయుడు ఆరా తీసినట్టు తెలిసింది. కేజీహెచ్‌లో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించేందుకు శనివారం నగరానికి వచ్చిన ఆయన బీచ్ రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో ఈ విషయమై మాట్లాడినట్టు సమాచారం. అనంతరం కేజీహెచ్‌కు చేరుకున్న చంద్రబాబు అక్కడ ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తుండగా, తన వెనక ఉన్న సీపీ శంఖబ్రత బాగ్చిని చూసిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆయన వద్దకు వెళ్లి జంట హత్యల గురించి అడిగారు. దీనికి సీపీ స్పందిస్తూ హత్యలు జరిగిన విషయం ఒకరోజు తర్వాత బయటకు వచ్చిందని, కేసు దర్యాప్తులో ఉందని వివరించారు.

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభం

పాఠశాలల పునఃప్రారంభం నాడు విద్యార్థులకు అందజేస్తాం: డీఈవో

గాజువాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల సరఫరాను శనివారం గాజువాకలోని పంపిణీ కార్యాలయంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. తొలి విడతగా పద్మనాభం, భీమిలి, ఆనందపురం మండలాలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా అన్ని పాఠశాలలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను ఎంఈవో కార్యాలయాలకు చేరుస్తామని, అక్కడ నుంచి మండల పరిధిలో గా స్కూళ్లకు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.



గాజువాకలో పుస్తకాల పంపిణీని ప్రారంభించిన డీఈవో ప్రేమ్‌కుమార్

పాఠశాలలు పునఃప్రారంభం రోజున అన్ని తరగతులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది త్వరగానే పాఠ్య పుస్తకాల ప్రారంభాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి

అగనంపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయులుకు స్థానిక టీడీపీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అగనంపూడి పరసర ప్రాంతాలను కలిపి ప్రత్యేక రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేయాలని, సర్వే నంబర్-56లో గత ప్రభుత్వం గురుకుల పాఠశాలకు కేటాయించిన 16 ఎకరాల భూమిని రద్దు చేయాలన్నారు. హోమీబాబా కేన్సర్ ఆస్పత్రిలో స్థానికంగా గల యువతకు ఉపాధి కల్పించాలని, పశు వైద్య కేంద్రానికి భవనాన్ని నిర్మించాలని, తలారివానిపాలెం రైల్వే ట్రాక్ వద్ద గల అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని విస్తరించాలని వేడుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు కర్రి దోలేంద్ర, ఇల్లపు ప్రసాద్, వి.సత్యనారాయణ, కె.శ్రీను, జగదీశ్, తదితరులు ఉన్నారు.

పేదలకు ఉచితంగా వైద్య సేవలందించాలని..

గాజువాక: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ద్వారా కార్డులు పొందిన ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా వైద్య సేవలందించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు శనివారం నగరంలో వినతిపత్రం అందజేశారు. కార్డు రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ.ఐదు లక్షల వరకు ఉచితంగా వైద్య సదుపాయం ఉంటుందని, గత ప్రభుత్వ హయాంలో కార్డులు ఉన్నప్పటికీ పేదలకు వైద్యం అందలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.



మంత్రికి సమస్యలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

దీనిపై పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు బొద్దు జగదీశ్, కృష్ణారావు, భువనేశ్వర్, పావని ఉన్నారు.

సమన్వయంతో పని చేయాలి

» సీఎంహెచ్‌వో నరేశ్ కుమార్

వేపగుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్నస్వామికి ఈనెల 30న జరిగే చందనోత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జీవీఎంసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జీవీఎంసీ సీఎమ్‌హెచ్‌వో నరేశ్‌కుమార్ సూచించారు. చందనోత్సవ ఏర్పాట్లపై జీవీఎంసీ పారిశుధ్య అధికారులతో శనివారం గోశాల వద్ద ఎస్‌వీఆర్ ఫంక్షన్‌హాల్‌లో సమీక్ష నరేశ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ వర్కర్స్ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆయన అన్నారు. అదేవిధంగా సింహాచలం కొండ పైన, కింద ఉన్న అధికా



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరేశ్‌కుమార్

రులు సమన్వయంతో పని చేసుకోవడానికి, సిబ్బందికి సూచనలు అందజేయడానికి వీలుగా ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అధికారులంతా ఆ గ్రూపులో ఎప్పటికప్పుడు సమస్యలు పెట్టాలని, దురుగ్గా పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కే.పైమావతి, ఏఎమ్‌హెచ్‌ఓలు బందారు అప్పలనాయుడు, రాజు తదితర విభాగాలకు చెందిన శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతర బ్రోచర్ విడుదల

ఎన్.ఎడీ.జంక్షన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల ఆరాధ్యదైవం శ్రీ బంగారమ్మ ఆలయంలో మే 20న పండుగ నిర్వహిస్తున్నామని త్రివేణి గ్రామాభ్యుదయ సేవాసంఘం సభ్యులు తెలియజేశారు. పండగ ఏర్పాట్లపై కమిటీసభ్యులు శనివారం చర్చించారు. పండుగకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. మే 11న పండగ చాటింపు, ప్రతీరోజు ఘటాల ఊరేగింపు, 19న తోలేళ్ల ఉత్సవం, 20న ప్రధాన పండుగను వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

» కార్పొరేటర్ బొమ్మిడి రమణ

ఎన్.ఎడీ.జంక్షన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులో పెండింగ్‌లో పనులను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని జీవీఎం ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరిందర్ ప్రసాద్‌కు కార్పొరేటర్ బొమ్మిడి రమణ వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా లక్ష్మీనగర్ ఎస్. బ్లాక్ రక్షణ గోడ నిర్మాణం, వివిధ కాలనీల్లో సామాజిక భవనాలకు అదనపు అంతస్తుల నిర్మాణం, వివిధ పార్కులకు అదనపు వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

విద్యుత్ దీపాల సమస్యపై నిరసన

మల్కాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరి కాలనీలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మల్కాపురం జోన్ సీపీఎం నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ శాంతిగిరి కాలనీలో 2019లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేశారు. కానీ, ఇప్పటి వరకు వాటికి కనెక్షన్ ఇవ్వలేదని ఆయన అన్నారు. దీని వల్ల ప్రాంతమంతా చీకటిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం పై పలు మార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు పెందుర్తిలో ట్రాఫిక్ మళ్లింపు

పెందుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):పెందుర్తిలో ఆదివారం మరిడిమాంబ జాతర సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని ట్రాఫిక్ ఎస్సై నరసింగరావు శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం నుంచి మరిడిమాంబ జాతర ముగిసేంతవరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించామని చెప్పారు. ఈ క్రమంలో విశాఖపట్నం నుంచి వేపగుంట మీదుగా శ్రీకాకుళం ఎస్.కోట వెళ్లేవాళ్లు వేపగుంట జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ ఇవ్వరేదని నుంచి మీదుగా వెళ్లాలని, విశాఖపట్నం నుంచి కొత్తవలస వెళ్లేవాళ్లు వేపగుంట జంక్షన్ నుంచి రాంపురం మీదుగా ఎన్‌హెచ్ 16 సర్వీస్ రోడ్డు నుంచి సరిపల్లి మీదుగా వెళ్లాలని, విశాఖపట్నం నుంచి ఆనందపురం వెళ్లేవాళ్లు వేపగుంట జంక్షన్ నుంచి గోశాల ఆదివరం మీదుగా సత్తువ జంక్షన్ నుంచి వెళ్లాలని ఆయన సూచించారు. హనుమంతువాక వెళ్లేవాహనాలు వేపగుంట గోశాల మీదుగా వెళ్లాలని సూచించారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు పెందుర్తిలో ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలకు సహకరించాలని ఎస్సై నరసింగరావు కోరారు.

ఉగ్రదాడి అమానుషం

పెందుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ సాయి హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో శనివారం కార్యకర్తలు, ప్రజలు, ప్రజాసంఘాల బ్యానర్లతో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సాయిరాం మందుల షాపు నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి అమృత నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ట్రస్ట్ సభ్యులు, యువత ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఉగ్రదాడి అమానవీయ చర్య అని నినాదాలు చేశారు. అనంతరం భారతీయులు సమైక్యంగా ఉగ్రదాడిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మానవహారంగా ఏర్పడ్డారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సిరిమల్లె గణేష్, ఉమాశంకర్,విరంజీవి, బాను, సునీత పాల్గొన్నారు.

ముగిసిన నూకాంబిక ఉత్సవాలు



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో మూడు రోజులపాటు జరిగిన శ్రీనూకాంబిక ఉత్సవాలు శనివారం రాత్రితో వైభవంగా ముగిశాయి. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన అమ్మవారిని సాయంత్రం ఘటాలు, మేలతాళాలు, గారడీలు, పులివేషాలు, కోలాటాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొద్దు నరసింహపాత్రుడు, దల్లి గోవిందరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బి.వెంకటస్వామిరెడ్డి, ఆర్.ఆనంద్, సీహెచ్ మురళీమోహన్, ఆచారి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐలో ఇన్‌పేషెంట్లకు భోజనం నిల్

మల్కాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ కార్మిక బీమా ఆసుపత్రి (ఈఎస్ఐ)లో ఇన్‌పేషెంట్లకు కొన్నేళ్లుగా భోజనం అందడం లేదు. దీంతో పేషంట్లు ఎవరి భోజనం వారే తెచ్చుకుంటున్నారు. కేజీహెచ్ మాదిరిగా ఒక్కొక్క పేషంట్‌కు మూడు పూటలా భోజనానికి సంబంధించి రూ. 80 ఇవ్వడానికి ఈఎస్ఐ అధికారులు ముందుకొచ్చారు. కేజీహెచ్‌లో ఎక్కువమంది ఇన్‌పేషెంట్లు ఉండడం వల్ల ఆ ధర గిట్టుబాటు అవుతోంది. ఇక్కడ ఈఎస్ఐలో కేవలం పదుమంది వరకూ ఇన్‌పేషెంట్లు లేకపోవడం వలన ఆ ధర గిట్టుబాటు అవ్వడం లేదని, రూ.80 కంటే ఎక్కువ ఇస్తే టెండర్లు వేస్తామని పలువురు కాంట్రాక్టర్లు అంటున్నారు. ధర విషయంలో నిర్ణయాన్ని ఇఎస్ఐ బోర్డు తీసుకున్నదని, విశాఖ బ్రాంచ్‌లో తీసుకున్న నిర్ణయం కాదని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

ఈఎస్ఐలో శనివారం సాయంత్రం ఆసుపత్రి డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్ పర్యటించారు. అనంతరం ఆస్పత్రిలో పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న సమస్యలను గురించి తెలుసుకున్నారు. ల్యాబ్, ఫ్లెటో పేటూ కొన్ని సదుకాల ఐటమ్స్ లేవని తెలియజేశారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కసరత్తు చేస్తానన్నారు.

శ్రీవారికి వజ్రకవచ అలంకరణ

పెందుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరం పై కొలువైన వెంకటేశ్వర స్వామి వజ్రకవచ అలంకరణ చేశారు. శనివారం ఆలయంలో స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చేశారు.



గ్రంథాలయంలో వేసవి శిక్షణ

పెందుర్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరానికి సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసినట్టు శనివారం గ్రంథాలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, పుస్తకపఠనం, క్విజ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు.

రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా ఏపీ

సీఐఐ సదస్సులో ఏపీ ప్రభుత్వ అంతరిక్ష రక్షణ రంగ తయారీ రంగాల గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లోని రక్షణ రంగం, వ్యూహాత్మక మౌలిక సదుపాయాల పై పెట్టుబడులు పెడుతున్నాయని, ఈ నేపథ్యంలో భారత దేశంలో ఆయా రంగాలకు చెందిన పరిశ్రమలకు మంచి భవిష్యత్తు ఉందని ఏపీ ప్రభుత్వ అంతరిక్ష, రక్షణ రంగ తయారీ రంగాల గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి. చిత్రంలో ఎస్ఐడీఎం ఏపీ చైర్మన్ జె.శ్రీనివాసరాజు, సీఐఐ విశాఖ చైర్మన్ డీఈన్ నారాయణరాజు.

ఏపీ ప్రభుత్వం సానుకూల విధానాల వల్ల ఆయా ఉత్పత్తుల తయారీ కేంద్రంగా మారే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) సంయుక్తంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, అంతరిక్షం తదితర రంగాల్లో ఇన్నోవేషన్ క్లస్టర్లు, ప్లగ్ అండ్ ప్లే టెస్టింగ్ కేంద్రాలు, టెక్నాలజీకి సంబంధించిన ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విశాఖపట్నంలో టీ టన్నింటికీ అత్యధిక అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా సముద్ర గర్భ పరిశోధనలకు కీలక కేంద్రంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐడీఎం చైర్మన్ జె.శ్రీనివాసరాజు మాట్లాడుతూ, విశాఖపట్నం సమీపంలో మేరీటైమ్ ఇండస్ట్రియల్ పార్క్ రానుందన్నారు. సీఐఐ విశాఖ జోన్ చైర్మన్ డీఈన్ నారాయణరాజు మాట్లాడుతూ విశాఖపట్నం గ్లోబల్ హబ్‌గా మారేందుకు సీఐఐ తన వంతు సహకారం అందిస్తుందన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ఆటోనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ టీడీపీ 70వ వార్డు ఇన్‌చార్జి చల్లి గోపి, అధ్యక్షుడు కేదీసెట్టి శంకరరావుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. వార్డు పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులు పైనిక దుస్తుల్లో వచ్చి పర్యాటకులను హతమార్చడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రమూకలకు కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు.కార్యక్రమంలో ప్రెసిడెంట్ నాగలు రవికుమార్,సత్య కూటమి నాయకులు తుంపాల రమేశ్, చిరంజీవి, రాము, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐదు కిలోమీటర్ల స్టీల్ మార్చ్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఆదివారం ఐదు కిలోమీటర్ల మే డే మార్చ్ నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ ప్లాంట్ నాయకులు తెలిపారు. ఉదయం ఆరున్నర గంటలకు ప్లాంట్ త్రిష్ణా మైదానంలో మార్చ్ ప్రారంభమవుతుందన్నారు. టౌన్‌షిప్‌లోని వివిధ సెక్టార్ల మీదుగా ఈ మార్చ్ జరుగుతుందని, ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా కోరారు.

ఆలయ సేవకులకు సత్కారం

అగనంపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శాంతినగర్‌లో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి శనివారం ఆలయంలో విశేష సేవలందిస్తున్న నక్కా రామమూర్తి, నరసింగరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మకర్త ఈకే చారి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిర్వహణ కోసం ఈ దంపతులు కొంత నగదును ఆలయ అకౌంట్‌లో జమ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సాయిబాబానాయుడు, కృష్ణారావు, సోమశేఖర్, గురునాథ్, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచవటి వుడా కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వేదపండితులు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు లక్ష్మీగణపతిని దర్శించుకుని, అన్న సమారాధనను ప్రారంభించారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లాప్రగడ మురళీకృష్ణ,తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఎమ్మెల్యే పల్లా ప్రారంభించి, సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు.


విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పి.గణబాబు, సీపీ శంఖబ్రత బాగ్చి


ఏఎంసీ సెంటినరీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం లోపల ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఫొటోలను తిలకిస్తున్న ముఖ్యమంత్రి, తదితరులు

నగరానికి సీఎం చంద్రబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, విశాఖ పర్యటనల్లో భాగంగా నగరానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన విజయవాడ నుంచి విశాఖ చేరుకున్నారు. ఎంపీ శ్రీభరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ప్రభుత్వ విప్ పి.గణబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, సీపీ శంఖబ్రత బాగ్చి, జేసీ కె.మయూర్ అశోక్, డీసీపీ డి.మేరీ ప్రశాంతి, ఆర్డీవో పి.శ్రీలేఖ, తదితరులు చంద్రబాబుకు


92 ఏళ్ల డాక్టర్ చిట్టి భద్రరావును ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. చిత్రంలో డాక్టర్ రవిరాజు, తదితరులు ఉన్నారు

స్వాగతం పలికారు. అనంతరం ఆయన హెలీకాప్టర్‌లో శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు. సాయంత్రం తిరిగి నగరానికి చేరుకున్న చంద్రబాబు ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు విరాళాలతో నిర్మించిన సెంటినరీ భవనాన్ని ప్రారంభించారు.

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు

విశాఖ,శ్రీకాకుళం, పర్యటనలను ముగించుకుని తిరిగి ప్రయాణమైన సీఎం చంద్రబాబుకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. రాత్రి 8.55 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం చంద్రబాబు ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.


స్నూకర్ బోర్డును తిలకిస్తున్న చంద్రబాబునాయుడు


ముఖ్యమంత్రిని సత్కరించి చిత్రపటాన్ని బహూకరిస్తున్న వైద్యులు



వేదికపై గల స్ర్కీన్‌పై చంద్రబాబుపై డాక్యుమెంటరీ ప్రదర్శన



..ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు. చిత్రంలో మంత్రులు సత్యకుమార్, శ్రీబాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజు ఉన్నారు


సీఆర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఐఐటీ పాలక్కాడ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్, ఎంపీ శ్రీభరత్, వీసీ జీపీ రాజశేఖర్ తదితరులు



మాజీ ప్రొఫెసర్ శాంతమ్మను సత్కరిస్తున్న కె.మధుమూర్తి, ఎ.శేషాద్రి శేఖర్, ఎంపీ శ్రీభరత్, ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ తదితరులు

ఏయూ వందేళ్ల వేడుకలు ప్రారంభం

ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం 99 ఏళ్లు పూర్తి చేసుకుని శనివారం నాటికి వందో వసంతంలోకి అడుగిడింది. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శతాబ్ది ఉత్సవాలను ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి, పాలక్కాడ్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శేషాద్రి శేఖర్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రొఫెసర్ ప్రసాదరావును సత్కరిస్తున్న దృశ్యం


థింసా నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా ఏయూ శతాబ్ది ఉత్సవ్ వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న ఏయూ ఆచార్యులు, విద్యార్థులు


కార్యక్రమంలో పాల్గొన్నా విదేశీ విద్యార్థులు

- పాల్గొన్న వీసీ, పలువురు ఆచార్యులు, విద్యార్థులు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యా ప్రమాణాలు పాటించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం ఆర్కే బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎందరో మహనీయుల కృషి ఫలితంగా విశ్వ కళామతల్లి ఆవిర్భవించిందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశిష్టతను చాటే విధంగా ఎల్లప్పుడూ విద్యార్థులు కృషి చేయాలన్నారు. విశ్వ కళామతల్లి ప్రాంగణంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందుకు దూసుకెళ్లేలా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా మన రాష్ట్రానికి, భారతదేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. వందేళ్ల చరిత్ర కలిగిన అతి కొద్ది యూనివర్సిటీల్లో ఏయూ ఒకటి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. దేశ, విదేశాల్లో ఎన్నో కీలక స్థానాల్లో ఏయూ పూర్వ విద్యార్థులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఏయూ రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఆచార్యులు వి.బాలమోహన్ దాస్, బీలా సత్యనారాయణ, జీఎస్ఎన్ రాజు, వీఎస్ఆర్‌కె ప్రసాద్, కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచన గొప్ప ఆవిర్భావానికి నాంది

- 'అడ్వెంట్ ఇంటర్నేషనల్' ఆపరేటింగ్ పార్టనర్ డాక్టర్ శివకుమార్
- ఘనంగా ఐఐఎం (విశాఖపట్నం) స్నాతకోత్సవం

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఏ ఉద్యోగం చేసినా ఎంతో కొంత రిస్క్ ఉంటుంది, అదే సొంతంగా సంస్థ నెలకొల్పితే ఉద్యోగాల కల్పనతో పాటు అద్భుతాలు సృష్టించగలిగే అవకాశం లభిస్తుందని అడ్వెంట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆపరేటింగ్ పార్టనర్ డి.శివకుమార్ పేర్కొన్నారు. బీచ్‌రోడ్డు నోవాటెల్ హోటల్‌లో శనివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (విశాఖపట్నం) స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శివకుమార్ మాట్లాడుతూ యువత ఉద్యోగుల కోసం వేచి చూసే కంటే సొంతంగా సంస్థలు నెలకొల్పేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఒక వినూత్న ఆలోచన గొప్ప ఆవిర్భావానికి నాంది అవుతుందని, అది ప్రపంచ గతినే మార్చగలదన్నారు. అలాంటి ఆలోచనల నుంచి వచ్చినవే ఫేస్‌బుక్, ఈ-కామర్స్ వంటివని పేర్కొన్నారు. విద్యార్థులు నైపుణ్యం సాధించే దిశగా సరికొత్త ఆలోచనతో ముందుకు వెళ్లాలన్నారు. పూర్తి స్థాయి లక్ష్య సాధనకు కష్టపడి ఇష్టపడి చదవాలన్నారు. విద్యార్థులకు ఆలోచనే మూల వస్తువని, ఆ ఆలోచనను అవగతం చేసుకొని ఆచరణలో పెడితే అద్భుత ఫలితాలను వస్తాయన్నారు. అనంతరం ఎంబీఏ గ్రాడ్యుయేట్లకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. గోల్డ్ మెడల్ సాధించిన నవనీత్ బ్రాటా, అనిర్‌బాన్ దత్తాలకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, బోర్డ్ ఆఫ్ గవర్నర్ జనత్ షా తదితరులు పాల్గొన్నారు.



గోల్డ్ మెడల్స్ సాధించిన నవనీత్ బ్రాటా, అనిర్‌బాన్ దత్తాను అభినందిస్తున్న డాక్టర్ శివకుమార్

చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలన

సింహాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్ శనివారం పరిశీలించారు. తొలుత వారు ఆలయంలో వేస్తున్న ఆరు లైన్ల క్యూ లైన్‌ను చూశారు. గతంలో ఆస్థాన మండపం, నీలాద్రి గుమ్మానికి నడుమ నాలుగు లైన్లు నడిపేవారు. ఈఏడాది భక్తుల రద్దీ పెరుగుతుందన్న అంచనా మేరకు ఆ ప్రాంతంలో ఆరు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని కమిషనర్ పరిశీలించి, అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అంతకముందు జేసీ అశోక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.


అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్

30న పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో 22 కేంద్రాల్లో రాయనున్న 9,382 మంది విద్యార్థులు

కంచరపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలీసెట్)-2025ను ఈ నెల 30న నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి నిర్వహణ ఏర్పాట్లుపై శనివారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ జిల్లా సమన్వయకర్త డా.కె.నారాయణరావు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం కో-ఆర్డినేటింగ్ సెంటర్ పరిధిలో గల భీమిలి, పెందుర్తి, విశాఖ రీజియన్స్ నుంచి ఈ ఏడాది పాలీసెట్‌కు 9,382 మంది హాజరవుతున్నారన్నారు. వీరి కోసం 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలా ఉండగా ఈ నెల 2న కళాశాలలో ప్రారంభమైన ఉచిత పాలీసెట్ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. శిక్షణ పొందిన 222 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్టు నారాయణరావు తెలిపారు. శనివారం నిర్వహించిన గ్రాండ్ టెస్టుకు 157 మంది హాజరయ్యారని తెలిపారు.

మంత్రి సమక్షంలో బీజేపీలో చేరికలు

మురళీనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్.పరశురామరాజు ఆధ్వర్యంలో శనివారం నగరంలోని బిర్లా జంక్షన్ బొచ్చ కన్వెక్షన్ హాల్ వేదికగా అంబేడ్కర్ సమ్మాన్ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో పలు పార్టీల నుంచి ముఖ్య నాయకులు బీజేపీలో చేరారు. కాంగ్రెస్ సీనియరు నాయకుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ కాశీవిశ్వనాథం, బి.జగదీష్ తదితరులకు మంత్రి సత్యకుమార్ పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి విశ్వనాథరాజు, కోశాధికారి ఎం.నాగేంద్ర, రాష్ట్ర అధికార ప్రతినిధి పి.తిరుపతిరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జి.రాకేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురు మైనర్ల అరెస్టు

మహారాణిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం, మత్తు పదార్థాలు సేవించి ఉన్న ముగ్గురు మైనర్లు రహదారిలో వస్తున్న వారిపై దాడి చేసి, ఘర్షణ పడడంతో మహారాణిపేట పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. సాలిపేటకు చెందిన ఈ ముగ్గురు మైనర్లు కొద్ది రోజుల క్రితం బాటసారులను అడ్డగించి దాడికి పాల్పడ్డారు. అడ్డుకున్న పోలీసు సిబ్బందిని సైతం ఖాతరు చేయకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడులకు దిగారు. వీరి ఆగడాలను సమీపంలో ఉన్న కొందరు సెల్‌ఫోన్ కెమేరాలలో చిత్రించి పోలీసు కమిషనర్‌కు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సీపీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాలతో మహారాణిపేట సీఐ భాస్కరరావు గాలించారు. జిల్లా పరిషత్ సమీపంలోని రెవెన్యూ క్వార్టర్ల వద్ద నిర్మానుష్య ప్రాంతంలో 1.9 కేజీల గంజాయితో ఆ ముగ్గురు మైనర్లు దొరికారు. వారిని విచారించి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

క్రైం... crime news

రెండు కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

పెందుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పాడేరు నుంచి గుంటూరుకు తరలిస్తున్న రెండు కిలోల లిక్విడ్ గంజాయిని పెందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఓ మహిళ కూడా ఉంది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముందుస్తు సమాచారం మేరకు శనివారం పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపం దొగ్గవానిపాలెం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో వస్తున్న ఒక వ్యక్తి, మహిళను తనిఖీ చేయగా రెండు కిలోల లిక్విడ్ గంజాయి లభ్యమైందన్నారు. నిందితులు మంద మార్తమ్మ, కంప జీసస్‌కుమార్‌లు గుంటూరు జిల్లాకు చెందిన వారని సీఐ తెలిపారు. వీరిద్దరూ గుంటూరు నుంచి పాడేరు వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేసి, గుంటూరులో విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. పట్టుబడిన లిక్విడ్ గంజాయి విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తనిఖీల్లో ఎస్ఐ స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మేడ పైనుంచి పడి వ్యక్తి మృతి


మృతుడు గోవింద్ (ఫైల్ ఫొటో)

మల్కాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండస్ట్రియల్ కాలనీలో ఓ వ్యక్తి మేడ పైనుంచి పడి మృతి చెందారు. ఈ కాలనీకి చెందిన తుంపాల గోవింద్ (50) విదేశాల్లో ఉద్యోగం చేస్తూ, ఇటీవలే సెలవుపై ఇక్కడకు వచ్చారు. ఈలోగా మేడ పైనుంచి పడి ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇటీవలే ఆయన భార్య లీలావతి (బేబీ) తన భర్త మద్యం సేవించి మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడుతున్నాడంటూ మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ సాగుతుండగానే ఆదివారం మధ్యాహ్నం గోవింద్ మేడపై నుంచి పడి మృతి చెందడం పలు అనుమానాలను తావిస్తున్నది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..


మృతి చెందిన కొండబాబు

సీతంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ప్రధాన రహదారిలో దుర్గా గణపతి ఆలయం కూడలిలో నడిచి వెళ్తున్న వ్యక్తిని సింహాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో మృతుడు కంచరపాలెం వాసి కొండబాబుగా తెలిసింది. సీతంపేట ప్రాంతంలో కూలి పనులు చేస్తూ అక్కడే ఉంటున్నట్లు తెలిసింది. అతని కుటుంబ సభ్యుల వివరాలు తెలియరాలేదు. దీంతో మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసినవారు తమను సంప్రదించాలని ద్వారకా పోలీసులు కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రవీంద్రకుమార్ (ఫైల్‌ఫొటో)

పద్మనాభం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తునివలస గ్రామంలో ఒక వ్యక్తి జీవితం మీద విరక్తితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. తగరపువలస గ్రామానికి చెందిన అలుగోలు రవీంద్రకుమార్ (40)కు తునివలసకు చెందిన పి. వరలక్ష్మితో అయిదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి అయిన దగ్గర నుంచి రవీంద్రకుమార్ అత్తవారి ఊరయిన తునివలసలో ఉంటున్నాడు. అతను మద్యానికి బానిస కావడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంటి హాలులో స్లాబ్ హుక్కుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడుకి ఒక కుమార్తె ఉంది. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.